RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily

అనకాపల్లి | సంపుటి: 3 | సంచిక: 228 | మంగళవారం | 21-01-2025 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 8 | వెల : 3.00





## రాష్ట్రంలో డిప్యూటీ సీఎం పై రచ్చ

**పెన్ సత్తా బ్యూరో డెస్క్ :** రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పదవి పై రచ్చ మొదలైంది. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం హోదా ఇవ్వాలని టీడీపీ ముఖ్య నేతలు డిమాండ్ చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న ఈ డిమాండ్ పై జనసేన, పవన్ మద్దతు దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కు మాత్రమే ఆ హోదా ఉంటుందని చెప్పి, ఇప్పుడు లోకేష్ గురించి ప్రతి పాదన చేయటం పైన జన సైనికులు మండి పడుతున్నారు. ఇదే అంశం పైన సోషల్ మీడియా వేదికగా పవన్ – లోకేష్ మద్దతు దారుల మధ్య వార్ ముదురు తోంది. ఇదే సమయంలో ఏపీలో తాజా పరిణామాల పైన బీజేపీ నాయకత్వం తమ వైఖరిని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎంగా జనసే నాని పవన్ ప్రస్తుతం ఉన్నారు. డిప్యూటీ సీఎం అయినా పవన్ కళ్యాణ్ తొందరపాటు తనంతో హోం మంత్రి పైన వ్యాఖ్యలు, తిరుపతి తొక్కిసలాట ఘటనలో పవన్ స్పందించిన తీరుతో ప్రభుత్వం పడుతున్న ఇబ్బందులతో కొత్త రాజకీయం మొదలైంది. పవన్ చేస్తున్న వ్యాఖ్యలతో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడు తోందనే అభిప్రాయం టీడీపీ నేతల్లో మొదలైంది. దీంతో, నేరుగా పవన్ ను టార్గెట్ చేయకుండా పవన్ తో పాటుగా లోకేష్ కు డిప్యూటీ సీఎం హోదా ఇవ్వాలనే డిమాండ్ వ్యూహాత్మకంగా తెర మీదకు తీసుకొచ్చారు. అయితే, పవన్ హోదా తగ్గకుండా మరెవరికీ డిప్యూటీ సీఎం హోదా ఇవ్వకూడదని గతం లోనే నిర్ణయించారు. తెలంగాణ, కర్ణాటక లోనూ భట్టి, డీకే శివకుమార్ విషయం లోనూ ఇదే ఫార్ములా అమలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో వార్






కాగా, కొద్ది రోజులుగా టీడీపీ నేతలు వరుసగా లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలంటూ వరుస డిమాండ్లు చేస్తున్నారు. తిరుపతి లో తొక్కిసలాట ఘటనలో పవన్ టీటీడీ బోర్డు, అధికారులు క్షమాపణ చెప్పాలని పవన్ డిమాండ్ చేసారు. దీని పైన లోకేష్ స్పందించిన తీరు సైతం చర్చగా మారింది. పవన్ డిమాండ్ తో టీడీపీకి సంబంధం లేదని లోకేష్ వ్యాఖ్యానించారు. ఇక, తాజాగా చంద్రబాబు సమక్షం లోనే టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేసారు. దీని పైన చంద్రబాబు స్పందించ లేదు. దీనికి మద్దతుగా పిఠాపురం నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వరుసగా టీడీపీ ముఖ్య నేతలు తెర పైకి వచ్చారు. లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని కోరుతున్నారు. ఢిల్లీ నేతల ఆరా డిప్యూటీ సీఎం పదవి పవన్ తో పాటుగా లోకేష్ కు ప్రతిపాదించటం పైన జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవన్ ఏ విధంగా కూటమి అధికారం లోకి రావటానికి కారణమయ్యారో వివరిస్తూ పోస్టింగ్స్ పెడుతున్నారు. దీంతో, సోషల్ మీడియా వేదికగా టీడీపీ, జనసేన మద్దతు దారుల మధ్య వార్ కొనసాగుతోంది. ఇదే సమయంలో ఈ వివాదం పైన బీజేపీ అధినాయకత్వం ఆరా తీసినట్లు సమాచారం. పదవుల విషయంలో చర్చలతో పరిష్కరించుకోవాలని. కూటమి సఖ్యత పై ప్రభావం పడేలా ఉండకూడదని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఈ వివాదం పై చంద్రబాబు, పవన్ స్పందించ లేదు. దీంతో ఈ రచ్చ రానున్న రోజుల్లో ఎలాంటి టర్న్ తీసుకుంటుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

## బాబా రామ్‌దేవ్ పై అరెస్ట్ వారెంట్

**తిరువనంతపురం :** పతంజలి ఆయుర్వేద్ ప్రజలను తప్పుదోవపట్టించే ప్రకటనలు ఇస్తోందని దాఖలైన ఫిర్యాదుపై కేరళలోని పాలక్కడ్ జిల్లా కోర్టు బాబా రామ్‌దేవ్, ఆయన సన్నిహితుడు ఆచార్య బాలకృష్ణలపై బెయిలబుల్ వారంట్లు జారీ చేసింది. కేరళకు చెందిన ఓ వైద్యుడు మూడేళ్ల క్రితమే ఈ అంశంపై కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కేరళలో పది కేసులు, ఉత్తరాఖండ్‌లో ఒక కేసు నమోదయ్యాయి. కన్నూర్‌కు చెందిన ఆప్తమాలజిస్ట్ కెవి బాబు దాఖలు చేసిన పలు ఫిర్యాదులను పురస్కరించుకొని కేరళ ఔషధ నియంత్రణ విభాగం రాష్ట్రంలోని తన కార్యాలయాలన్నింటికీ ఆదేశాలు జారీ చేసింది. 1954 డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అభ్యంతరకర ప్రకటనలు) చట్టాన్ని ఉల్లంఘించినందుకు పతంజలిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. కొన్ని పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు బిపి, సుగర్ వ్యాధులను నయం చేస్తాయని, ఇతర ఆరోగ్య సమస్యలను కూడా తీరుస్తాయని వ్యాపార ప్రకటనలు ఇచ్చారు. ఇలాంటి ప్రకటనలు జారీ చేయడాన్ని డిఎంఆర్ చట్టం నిషేధిస్తోంది.



## విమానాశ్రయంలో కలుసుకున్న తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు

స్విట్జర్లాండ్ : రేవంత్ రెడ్డి బృందం విమానాశ్రయంలో దిగిన సమయం లోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్ విమానాశ్రయానికి చేరుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం లోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్‌లో విజయవంతమైన పర్యటన తర్వాత సోమవారం ఉదయం స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్‌లో దిగింది. జ్యూరిచ్ విమానాశ్రయంలో తెలంగాణ ప్రవాసులు బృందానికి ఘనస్వాగతం పలికారు. జనవరి 20 నుంచి దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకానమీ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో ప్రతినిధి బృందం పాల్గొంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ తో ఐటీ మంత్రి డి.శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు, ఉన్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంట రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, అధికారుల ప్రతినిధి బృందం కూడా విమానాశ్రయానికి చేరుకుంది. ఇద్దరు ముఖ్యమంత్రులు, మంత్రులు కొద్దిసేపు ముచ్చటించారు. దావోస్ కాన్ఫరెన్స్‌లో భాగంగా తొలిరోజు ఇద్దరు ముఖ్యమంత్రి వారి మంత్రి గణంతో పలువురు పారిశ్రామిక వేత్తలను కలవనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశ్రమల ప్రముఖుల నుండి ఎవరి రాష్ట్రంలో వారు భారీ పెట్టుబడులను సృష్టించడం, అంతర్జాతీయ పెట్టుబడి గమ్యస్థానంగా రాష్ట్రాలను ప్రపంచానికి తెలియజేయడం పై దృష్టి సారించారు. అందులో భాగంగా పలు ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరపనుంది. గత సంవత్సరం, తెలంగాణ 40,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది, ఆ పెట్టుబడులు చాలా వరకు ఇప్పుడు పూర్తి ఆగిపోయాయి. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ప్రకారం, ఈ సంవత్సరం లక్ష్యం 1 లక్ష కోట్లు అని అధికారులు ప్రణాళికకు అనుగుణంగా సమావేశాలను ఏర్పాటు చేశారు. దావోస్ సమావేశానికి ప్రతినిధి బృందాలను పంపిన ఆరు భారతీయ రాష్ట్రాలలో వారు లక్ష్యాన్ని చేరుకుంటారని అతిపెద్ద లబ్ధిదారుగా అవతరిస్తారనే నమ్మకంతో ఇద్దరు ముఖ్యమంత్రులు ముందుకు వెళు తున్నారు.



## నా కుమారుడికి ఉరిశిక్ష విధించినా అభ్యంతరం లేదు

**కోల్‌కతా :** తన కుమారుడికి ఉరిశిక్ష విధించాలని కోర్టు నిర్ణయిస్తే అభ్యంతరం లేదని నిందితుడు సంజయ్ రాయ్ తల్లి ఆదివారం తెలిపారు. కోల్‌కతా అభయ కేసులో సివిక్ పోలీస్ వాలంటరీ సంజరు రారుని దోషిగా నిర్ధారిస్తూ సిల్దా కోర్టు శనివారం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. శిక్ష వివరాలను సోమవారం వెల్లడించనుంది. ఈ తీర్పుపై సంజయ్ రాయ్ తల్లి మాలతీరారు (70) స్పందించారు. ముందు మీడియాతో మాట్లాడేందుకు కొద్దిగా సంకోచించారు. ఒక మహిళగా, ముగ్గురు కుమార్తెల తల్లిగా బాధితురాలి తల్లి ఆవేదన, బాధ తనకు తెలుసునని అన్నారు. హత్యాచారానికి గురైన ట్రైనీ వైద్యురాలు కూడా తన కుమార్తెలాంటిదేనని అన్నారు.అతని నేరం రుజువైనందున కోర్టు అతనిని ఉరితీయాలని నిర్ణయించినా ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. తల్లిగా ఒంటరిగా ఏడుస్తానని, కానీ, తలరాతను అంగీకరించాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు విచారణ సమయంలో కాని, లాకప్‌లో కాని సంజరు రారుని కలిశారా అని మీడియా ప్రశ్నించ లేదని, ఎందుకు కలవాలని సమాధానమిచ్చారు.



### ఏపీలో ఫిబ్రవరి 1 నుంచి అర్హత లేని వారికి పింఛన్లు కట్

**అమరావతి పెన్ సత్తా :** ఏపీలో అర్హతలు లేకుండానే పింఛన్లు తీసుకుంటున్న వారిని ఏరి వేసేందుకు అధికార యంత్రాంగం తనిఖీలు మొదలు పెట్టింది. తాజాగా దివ్యాంగుల కేటగిరీలో అర్హత లేని వారిని గుర్తించేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఈ నెల 22 నుంచి 30 వరకు పీజీ వైద్య విద్యార్థులు రోజుకు 200 మంది లబ్ధిదారులకు చొప్పున పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకవేళ వైద్య పరీక్షలకు లబ్ధిదారులు వెళ్లకపోతే ఫిబ్రవరి 1 నుంచి అనర్హులకు పింఛన్లు నిలిపి వేయనున్నారు.




## జగన్ బెయిల్ రద్దు పై రఘురామ పిటిషన్ల పై కీలక పరిణామం

దిల్లీ: రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్ల పై సుప్రీం కోర్టులో కీలక పరిణామం, జగన్ బెయిల్ రద్దు, కేసుల ట్రయల్ విచారణ ధర్మాసనం మరోసారి మార్పు. గతంలో విచారించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం నుంచి, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనానికి మార్చిన సుప్రీంకోర్టు. రిజిస్ట్రీ గత 12 ఏళ్లుగా ట్రయల్ అడుగు ముందుకు కదల్లేదన్న రఘురామ న్యాయవాది. పదేళ్లుగా ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్ కూడా డిస్పోజ్ చేయలేదన్న న్యాయవాది. సీబీఐ, నిందుతులు కుమ్మక్కై అడుగు కూడా కదలనీయలేదన్న రఘురామ న్యాయవాది. వాదనలు విని నిర్ణయం వెలువరించ కుండానే ఐదుగురు జడ్జీలు బదిలీ అయ్యారన్న న్యాయవాది. ఐదు సార్లంటే తప్పనిసరిగా కుట్ర కోణం ఉందని రఘురామ తరపు న్యాయవాది వాదన. ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్ పైనా తుది నిర్ణయం లేకుండా బదిలీలో కుట్ర కోణం ఉందన్న న్యాయవాది. ట్రయల్ బదిలీ పై పిటిషన్ వేశామని, ఇప్పుడు ఆ రెండూ తాము కోరట్లేదన్న రఘురామ న్యాయవాది. బదిలీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత విచారణ లోనే చెప్పిందన్న న్యాయవాది. తాము ఇప్పుడు కేసు మానిటరింగ్ పూర్తిస్థాయి లో జరగాలనే కోరుతున్నామన్న న్యాయవాది. సీబీఐ కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితి పై అఫిడవిట్ దాఖలు చేసిందన్న దర్యాప్తు సంస్థ న్యాయవాది. కేసును హైకోర్టు మానిటర్ చేస్తోందని, ఇంకా పెండింగ్ లో ఉందన్న జగన్ న్యాయవాది. గత పదేళ్లుగా ట్రయల్ జాప్యం కొనసాగుతూనే ఉందన్న రఘురామ తరపు న్యాయవాది. కేసులో వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలన్న సీబీఐ తరపు న్యాయవాది. ఏఎస్‌జీ మరో కేసులో వాదనలు వినిపిస్తున్నందున వాయిదా వేయాలన్న సీబీఐ న్యాయవాది.



# సంపాదకీయం

## ఇస్రో అసమాన్య ఘనత

విఫలమైనా ప్రతీసారి ఆకలి చావులు ఆపలేని దేశానికి అంతరిక్ష ప్రయోగాలు అవసరమా? అంటూ దశాబ్దాలుగా ఎగతాళి చేస్తూనే వున్నారు? పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి ఎన్నో సమస్యలను స్వాతంత్ర్య భారతం నుంచి తరిమేయలేని వారికి జాబిల్లి పై విక్రమ్ జాడ అవసరమా? అంటూ వెనక్కి లాగుతూనే వున్నారు? అయినా బాధను దిగమింగి బాధ్యతగా పని చేస్తూ.. విఖ్యాత భారతీయ శాస్త్రవేత్తలు విక్రమ్ సారాబాయ్, హెూం జహంగీర్ బాబా, అబ్దుల్ కలాం వంటి ఎంతోమంది మహానుభావుల స్ఫూర్తితో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అగ్రరాజ్యాలకు దీటుగా ఎదిగితేనే మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారగలం అని నమ్మి ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, తదితర సిబ్బంది అహర్నిశలు గెలుపోటములకు అతీతంగా ప్రయోగాలతో యుద్ధం చేస్తూనే వున్నారు మన దేశాన్ని గెలిపించడానికి..! ఇప్పుడు ఇండియాకే కాదు.. యావత్ ప్రపంచానికి పాఠం చెబుతుంది ఇస్రో..! 'ఆగని ప్రయత్నాల పరంపరే అంతరిక్షపు హద్దులను చెరిపేస్తుందని, అలుపెరగని కఠోర శ్రమతో కూడిన ఆత్మవిశ్వాసపు శోభకు అనంత విశ్వం తలొంచుతుందని ,స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ విజయంతో ఇస్రో అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్‌ను నిలిపింది. భవిష్యత్‌లో స్పేస్ స్టేషన్, చంద్రయాన్- 4, గగనయాన్ తదితర ప్రాజెక్టుల విజయానికి నాంది పలికింది. డిసెంబర్ 30, 2024న చేపట్టిన స్పేడెక్స్ ప్రయోగం దశల వారీగా మన శాస్త్రవేత్తలు విజయవంతం చేశారు. కీలకమైన ఎస్‌డిఎక్స్ 01(ఛేజర్), ఎస్‌డిఎక్స్ 02(టార్గెట్) ఉపగ్రహాలను అంతరిక్షంలో అనుసంధానం చేసే దశను మనం దాటేశాం. ఈ డాకింగ్ ప్రక్రియ కోసం సెన్సర్ల సాయంతో మూడుసార్లు ప్రయత్నించి, పరిస్థితులు అనుకూలించక చివరిలో విరమించుకోవాల్సి వచ్చింది. వృత్తాకార కక్ష్యలో భూమి చుట్టూ గంటకు వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న ఉపగ్రహాలను వాటి వేగాన్ని నియంత్రిస్తూ, బాగా తగ్గించి, చివరికి 3 మీటర్ల దూరం వచ్చాక చాలా జాగ్రత్తగా డాకింగ్ ప్రక్రియ చేసి ఒకే యూనిట్‌గా మార్చడం చాలా కష్టం. అయినా మన శాస్త్రవేత్తలు గురువారం ఉదయం దాన్ని సాధించి చరిత్ర సృష్టించారు. ఇప్పుడు అనుసంధానమైన శాటిలైట్‌ల మధ్య విద్యుత్ ప్రసారం చేసి స్పేస్‌లో ఉపగ్రహాల మధ్య సర్వీసింగ్‌ను పరిశీలిస్తారు. ప్రయోగాలు పూర్తయ్యాక అన్ డాకింగ్ ప్రక్రియను కొనసాగిస్తారు. ఈ రెండు ఉపగ్రహాలు రెండు సంవత్సరాల పాటు మనకు సేవలు అందించనున్నాయి. ఈ అసాధారణ విజయంతో మన అంతరిక్ష ప్రయోగాల జోరు ప్రపంచ పత్రికల్లో ప్రముఖ వార్త అయ్యింది. ఇదే సందర్భంలో కేంద్ర ప్రభుత్వం రూ. 3,984 కోట్లతో శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మించాలని తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. ఇప్పటికే విదేశీ ఉపగ్రహాలను రోదసీలోకి విజయవంతం గా ప్రవేశపెడుతూ అంతరిక్ష వ్యాపారంలో దూసుకుపోతున్న మనం త్వరలోఎఇంకా మెరుగైన ప్రయోగ ఫలితాలతో దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా ఇస్రో వుంటుందని మనం గట్టిగా చెప్పవచ్చు. ఎక్కడ మొదలుపెట్టాం మనం. సైకిల్‌పై రాకెట్ల విడిభాగాలను మోసుకెళ్ళాం. అంగారక గ్రహంపై జీవరాశి మనుగడను శోధిస్తున్నాం. తొలి ప్రయత్నంలో నిలబడలేని విక్రమ్ ల్యాండర్ అపజయంపై నాలుగు సంవత్సరాలు పెద్ద యుద్ధం చేసి పోగొట్టుకున్నచోటే నిలబడి చంద్రుని ఉపరితలంపై విక్రమ్ సాక్షిగా ప్రజ్ఞాన్ రోవర్‌తో అడుగులు వేయించాం. శుక్రయాన్‌కు సిద్ధమవుతున్నాం.



అంతరిక్ష వ్యవసాయం కోసం అన్వేషిస్తున్నాం. మానవ సహిత రోదసీ యాత్రల కోసం ఉత్సాహంగా బయలుదేరు తున్నాం. కేవలం పాన్ ఇండియా స్థాయి సినిమాల బడ్జెట్‌తో మన మేధో అంతరిక్ష సినిమాలను ప్రపంచానికి చూపిస్తూ తగ్గేదేలే.. శభాష్ అనిపించుకుంటున్నాం. మన జాతీయ జెండాను సగర్వంగా అగ్రరాజ్యాలకు దీటుగా, స్ఫూర్తివంతంగా నిలుపుతున్నాం..! ఎలా మొదలుపెట్టాం అని కాదు! ఎంతలా ఎదిగాం అనేదే నేటి 'మ్యాటర్'. అదే భావి భారత తరాలకు న్యూ చాప్టర్. గమనమే నీ గమ్యమైతే బాటలోనే బ్రతుకు దొరుకు అన్నట్లు.. మన ఇస్రో ప్రయాణం, ప్రకాశం విశ్వరహస్యాల శోధనలో నిరంతరాయంగా విజయవంతంగా కొనసాగాలి.

# జ్యూరిచ్‌లో తెలుగు డయాస్పోరా ఆత్మీయ సమావేశంలో లోకేష్



**జ్యూరిచ్ :** 2023 ఆర్బీఐ డేటా ప్రకారం, ఏపీ ఎన్ఆర్ఐల ద్వారా భారతదేశం లోనే అత్యధికంగా 40,000 కోట్లకు పైగా రెమిటెన్స్‌లను అందుకున్న ఏపీకి, ప్రవాసాంధ్రులు ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర వహిస్తున్నారు. జ్యూరిచ్‌లో జరిగిన తెలుగు డయాస్పోరా ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ప్రవాసాంధ్రులు, తమ రాష్ట్రంతో భావోద్వేగ బంధాన్ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా, వారు ఎక్కడ నివసించినా తెలుగుదేశం పార్టీకి, ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని గుర్తించారు. ఈ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ ప్రపంచాన్ని ఏలే సత్తా తెలుగువారికే ఉంది అని, ప్రవాసాంధ్రులకు మరింత సహాయ, సహకారం అందించేందుకు ఏపీ ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ సంయుక్తంగా ఎక్స్ పోర్ట్, ఇంపోర్ట్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ ప్రవాసాంధ్రులకు అనుకూలమైన విధానాలు ప్రవేశపెట్టే ప్రకటన చేశారు.

# టిడిపి తోనే చేనేతలకు స్వర్ణ యుగం సునీత

- నేతన్నలను అన్ని విధాలుగా ఆదుకుంటాం
- చెనేతకు పూర్వ వైభవం తెస్తాం
- దేశంలో వ్యవసాయ రంగం తరువాత అతి పెద్ద రంగం చెనేత

**సోమందేపల్లి, పెన్ సత్తా, జనవరి 20:** సోమందేపల్లి లో స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా 14.40 లక్షలతో వర్క్ షెడ్లు నిర్మించడానికి 24 మందికి పంపిణీ చేసిన మంత్రి సవిత. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తోనే చేనేతలకు స్వర్ణ యుగమని తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రం లోని చౌడేశ్వరి కళ్యాణ మండపం నందు సోమందేపల్లి క్లస్టర్ చేనేత కార్మికులకు మొదట విడతగా మంజూరైన 24 మందికి 14.40 లక్షల రూపాయలతో వర్క్ షెడ్లు నిర్మించుట కై నిధులు విడుదల చేయడం జరిగిందని, చేనేత లకు చెక్కును పంపిణీ చేసిన మంత్రి సవిత. తెలుగుదేశం పార్టీ తోనే చేనేతలకు పూర్వవైభమని మంత్రి సవిత అన్నారు. మొత్తం 80 మంది చేనేత కార్మికుల గాను 21.41 లక్షలతో 240 హుక్స్ జాకార్డ్స్ మోటార్స్ తో కూడిన లిఫ్టింగ్ మిషన్ పరికరాలు, ఫ్రేమ్ రూమ్స్ సెట్స్ అందించడం జరుగుతుందని, అందులో భాగంగా మొదట విడతలో భాగంగా 24 మంది చేనేత కార్మికులు గాను 14.40 లక్షలతో షెడ్లు నిర్మించుటకై నిధులు విడుదల చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అదేవిదంగా చేనేతలకు ఎన్టీఆర్ భరోసా కి పథకం కింద 50 సంవత్సరాలు పైబడిన చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి నెలకు 4,000 రూపాయలు మొత్తం అందజేస్తున్నదని మంత్రి తెలిపారు. అదేవిధంగా చేనేత ముద్ర పథకం కింద చేనేత వృత్తి పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న వారికి 50 వేల నుండి, రెండు లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించబడుతున్నదని మంత్రి తెలిపారు జిల్లాలోని సోమందేపల్లి నందు 116.62 లక్షలతో 164 మంది చేనేత కార్మికులకు కొరకు చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయబడినదని, అదే విధంగా హిందూపురం లోని 292 మంది చేనేత కార్మికులకు హిందూపురం చేనేత క్లస్టర్ మంజూరు అయ్యినదని, ధర్మవరం నందు చేనేత కార్మికుల కొరకు ధర్మవరం మెగా చేనేత క్లస్టర్ను ఏర్పాటుకు కొరకు ప్రస్తుతం బేస్ లైన్ సర్వే కొనసాగుతున్నదని మంత్రి సవి తెలిపారు. అదే విధంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ సబ్సిడీ సోలార్ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలియజేసిన మంత్రి సవిత. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, కూటమి నాయకులు, చేనేతలు తదిరులు పాల్గొన్నారు.








# గిరిజన ఆదివాసీ సమ్మేళనం లో వెంకయ్య

**విజయవాడ పెన్ సత్తా జనవరి 20:** గిరిజనులు, ఆదివాసీల ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, ఈ అవకాశాన్ని గిరిజనులు ఉపయోగించుకుని వ్యాపార రంగంలో రాణించాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరిజన-ఆదివాసీ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఆదివాసులు తమదైన ప్రత్యేక హస్తకళా నైపుణ్యాన్ని కలిగి ఉన్నారని, అందుకే వారి సహజ సిద్ధ నైపుణ్యాలను ప్రోత్సహించడం, వారి ఉత్పత్తులను ప్రచారం చేయడం, వారి ఆదాయ వనరులను మెరుగుపరచడం ఎంతో ముఖ్యమని చెప్పారు. గిరిజనుల వివిధ ఉత్పత్తులు, హస్తకళల సహజసిద్ధ నైపుణ్యాలకు వ్యాపార విలువలను జోడించుకోవాలని సూచించారు. ఈ కామర్స్, డిజిటల్ వ్యాపార మార్గాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ-గిరిజన యువకులు సాంకేతి కతను అంది పుచ్చుకుని, అభివృద్ధి సాధించవచ్చని, ఈ దిశగా ఆదివాసీ గిరిజనులందరూ ఏకతాటి పైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. మీరు ఒక్క అడుగు ముందు కేస్తే, మీ కోసం వంద అడుగులు ముందుకు వేయడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయనే విషయాన్ని ఆదివాసీ గిరిజన సోదరులు గ్రహించాలని చెప్పారు. దేశ జనాభాలో ఆదివాసీలు దాదాపుగా 10 కోట్ల మంది ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ప్రసంగించారు.




# ఇండియాలో మొదటి ఎయిర్ ట్యాక్సీ ఆవిష్కరణ

**పెన్ సత్తా డెస్క్ :** ఇండియాలో మొట్ట మొదటి ఎయిర్ ట్యాక్సీ నమూనాను ఓ స్టార్టప్ కంపెనీ తాజాగా ప్రదర్శించింది. ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్పోలో ఎయిర్ ట్యాక్సీ శూన్య ను బెంగళూరుకు చెందిన ఏరోస్పేస్ స్టార్ట ప్ సర్లా ఏవియేషన్ ఆవిష్కరించింది. ఎయిర్ ట్యాక్సీ సేవలను 2028 నాటికి బెంగళూరు నగర పరిధిలో ప్రారంభిస్తామని కంపెనీ వెల్లడించింది.



# స్వర్ణాంధ్ర నిర్మాణం కోసం జురిచ్ తెలుగు వారికి చంద్రబాబు ఆహ్వానం

**జురిచ్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జురిచ్ లోని తెలుగు దేశీయులతో మమేకమయ్యారు. తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచ వేదికలో గుర్తింపు పొందుతూ, తెలుగు ప్రజలు గ్లోబల్ లీడర్లుగా ఎదుగుతున్నారన్నారు. తెలుగు వారు కష్టంతో, ఉత్తమత ఆలోచనలతో, ఉత్సాహంతో ప్రపంచం మొత్తాన్ని అభివృద్ధి పరుస్తూ మెరుస్తున్నారు అని చంద్రబాబు అన్నారు. ఈ వేడుకలో ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రణాళికలను 2047 వరకు స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని పంచుకున్నారు. మా పి 4 మోడల్, ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములుగా అనే నినాదంతో, ఆయన రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. తెలుగుదేశీయుల దయాస్ఫోరాను ఏపీ భవిష్యత్తులో పెట్టుబడులు పెట్టి, అభివృద్ధిలో భాగస్వాములుగా కావాలని చంద్రబాబు కోరారు. మనం అందరం కలసి ఆరోగ్య కరమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



# హెచ్ ఎం వి పై పూర్తి అప్రమత్తత

**- విమ్స్ ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు**
**- వైరస్ పై ఆందోళన వద్దు విమ్స్ డైరెక్టర్ రాంబాబు**
**- మందులు, ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధం చేసిన అధికారులు**

అరిలోవ పెన్ సత్తా : దేశంలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్ఎంపివి) కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కోవిడ్‌లో వేలాది మందికి వైద్యం అందించిన విమ్స్ ఆస్పత్రి యంత్రాంగం అప్రమత్తమైంది. ముందుస్తు చర్యగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆదేశాల మేరకు ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన (నిమిషంలో 60 లీటర్ల ఆక్సిజన్ అందించే హై ఫ్లోన్యాసల్ కాన్యులాను కూడా సిద్ధం చేశారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వార్డును విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు సందర్శించి, ఏర్పాట్లపై పరిశీలించారుఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ వైరస్‌పై వస్తున్న వదంతులు నమ్మవద్దని, ఇది ప్రాణాంతకం కాదని, సాధారణ ఫ్లూ వైరస్ లక్షణాలే కనిపిస్తాయని స్పష్టం చేశారు.

**వైరస్ లక్షణాలు..** జ్వరం, గొంతునొప్పి, ముక్కు దిబ్బడ, ఆయాసం వంటివి వైరస్ లక్షణాలు. వైరస్ సోకిన వారికి రిబావిరిన్, అజిత్రో మైసిన్ లాంటి మందులతో చికిత్స అందిస్తారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉంది. హైరిస్క్ గ్రూపులకు చెందిన హెచ్ఐవి, క్షయవ్యాధి, డయాలసిస్ రోగులు, సిఒపిడి, ఆస్తమా రోగులు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు హెచ్ఎంపివి వైరస్ బారిన పడే అవకాశం ఉంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు:** చేతులు పరిశుభ్రత పాటించాలి. మాస్కులు ధరించాలి. బహిరంగ ప్రదేశాల్లో తుమ్మడం, దగ్గడం చేయ కూడదు.వైరస్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకుని, పాజిటివ్‌గా తేలితే ఐసోలేషన్‌లో తగు వైద్యం పొందాలిఆందోళన వద్దుహెచ్ఎంపివి సాధారణ జలుబు లాంటిది.

**భయాందోళన అవసరం లేదు:** కోవిడ్ మాదిరిగానే జాగ్రత్తలు తీసుకుంటో సరిపోతుంది. పిల్లలు, వృద్ధులు, హైరిస్క్ గ్రూపు వారు అప్రమత్తంగా ఉండాలి. ముందుస్తు చర్యల్లో భాగంగా విమ్స్ ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును అవసరమైన మందులతో ఏర్పాటు చేశాం అని విమ్స్ లో ఏర్పాటు చేసిన హెచ్ ఎమ్ పి వి వార్డ్ ను పరిశీలంచి తరువాత మాట్లాడుతూ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలియజేసారు.



# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సుందరపు

**యలమంచిలి, పెన్ సత్తా, జనవరి 20:** పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులకు అరగంట పాటు ఆయన పాఠాలు బోధించారు. ఈ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ప్రతిభను పరిశీలించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఆరు నెలల్లో ప్రభుత్వం విద్యాశాఖ లో ఎన్నో మార్పులు తీసుకు వస్తుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బోధనా వివరాల గురించి, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.





# గంజాయి కేసులో నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

**అనకాపల్లి, పెన్ సత్తా జనవరి 20:** అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 28.06.2021న నమోదైన గంజాయి కేసులో నిందితుడైన బొంది రమేష్‌కు సంబంధించి 10 వ అదనపు జిల్లా కోర్టు, అనకాపల్లి తీర్పు వెల్లడించిందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ముద్దాయి బొంది రమేష్ 2021 లో అనకాపల్లి టౌన్ పీఎస్ పరిధిలో శారదా నగర్ బ్రిడ్జి దగ్గర ఉమా రామలింగేశ్వర స్వామి గుడి వద్ద ఒక ప్లాస్టిక్ సంచి పట్టు కొని కనిపించాడు. పోలీసులను చూసి నిందితుడు పారిపోవడంతో అనుమానంతో వెంటనే ఎస్సై, సిబ్బంది అతడిని పట్టుకున్నారు. సదరు నిందితుడిని ప్రశ్నించినప్పుడు అతని వద్ద ఉన్న సంచిలో 2 కేజీల గంజాయి ఉందని అంగీకరించాడు. పోలీసులు గంజాయి అమ్మడం, కొనడం, లేదా తన ఆధీనంలో ఉంచుకోవడం నేరమని తెలియజేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం అభియోగ పత్రాన్ని న్యాయస్థానానికి సమర్పించారు. ఈ కేసు అనకాపల్లి 10 వ అదనపు జిల్లా కోర్టు నందు వాద, ప్రతివాదనలు కొనసాగగా, న్యాయమూర్తి నందనవనం శ్రీ విద్య నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు, రూ.25 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన అప్పటి అనకాపల్లి టౌన్ ఎస్సై ఎల్.రామకృష్ణ, వాదనలు సమర్థంగా వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.హెచ్. వీర కృష్ణ, అనకాపల్లి టౌన్ పి.యస్ సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది, కోర్టు నందు సాక్షులను సకాలంలో హాజరు పరిచిన వారిని అభినందించారు.



# ప్రజా సమస్యల అర్జీల పై సకాలంలో చర్యలు తీసుకోవాలని కలెక్టరు

**అనకాపల్లి, పెన్ సత్తా జనవరి 20:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీల పై సకాలంలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై ఎస్ వి కె జి ఎస్ ఎల్ సత్యనారాయణ రావు, ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజలు అందజేసిన అర్జీల సమస్యల గూర్చి సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి అర్జీల పరిష్కారానికి ఆదేశాలు జారీచేసారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీల పై సకాలంలో చర్యలు తీసుకోవాలని, అర్జీలు తిరిగి ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు. అధికారులు అర్జీదారునితో మాట్లాడి వారి సమస్యకు పరిష్కారం చూపాలని, అర్జీదారుని అర్థమయ్యేవిధంగా సమస్య పరిష్కారం గూర్చి తెలియజేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మండల కార్యాలయాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్న విషయాన్ని గ్రామస్థాయిలో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.







# అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు

## -జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి

**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 20:** దీపం-2 ఉచిత గ్యాస్ పథకం కింద లబ్ది దారులకు అందిస్తున్న గ్యాస్ సిలెండర్లకు చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి తెలిపారు. ఈ విషయ మై సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులు అయిన పేద కుటుంబముల వారికి సంవత్సరానికి మూడు (3) గ్యాస్ సిలిండర్ లు ఉచితంగా పంపిణీ చెయ్యడము జరుగుతున్నదన్నారు. నిర్దేశించిన ధరల ప్రకారం 15 కిలో మీటర్ల పరిధిలో గ్యాస్ డెలివరీ ఉచితం గాను, 15 కిలోమీటర్ల పరిధి దాటినచో ముప్పది రూపాయలు మాత్రమే వినియోగదారులు చార్జి చెల్లించాలన్నారు. అదేవిధముగా లబ్దిదారులు దీపం-2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన ఆసలు బిల్లుకు అదనంగా కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్ లు డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపద్యములో గ్యాస్ పంపిణీదార్లు, గ్యాస్ ఏజన్సీ ల ప్రాంతీయ సెల్స్ అధికారులతో సమావేశం నిర్వహించి, లబ్దిదారులనుంచి వచ్చిన ఫిర్యాదులు రుజువు అయిన యెడల సదరు గ్యాస్ ఏజెన్సీల పై తగు చర్యలు తీసుకోనబడునని హెచ్చరించడ మైనదన్నారు. జిల్లాలో గల గ్యాస్ పంపిణీదార్లు తమ డెలివరీ బాయ్ లు ఖచ్చితంగా, సక్రమంగా గ్యాస్ సిలెండర్లు డెలివరీ చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎటువంటి అవకతవకలు జరుగకుండా, అదనంగా రుసుంలు వసూలు చేయకుండా నియంత్రించాలని ఆదేశించడమైనదని తెలిపారు. అదేవిధంగా ఎలాంటి పిర్యాదు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ క్షేత్ర సిబ్బందికి ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. కావున లబ్దిదారులు ఈ పథకం కింద ఏ ఒక్కరూ ఎటువంటి అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆ విధముగా కాకుండా లబ్దిదారుల నుండి గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేసినచో పౌర సరఫరాల విభాగపు టోల్ ఫ్రీ బరు 1967 కు లేదా ఆయిలు కంపెనీల ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటరు 1800 2333555 అనే నెంబర్లుకి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా కూడా ఫిర్యాదు చెయ్యవచ్చునని జాయింటు కలెక్టరు తెలిపారు. కావున జిల్లాలో గల గ్యాస్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# ప్రతి ఒక్కరికి లెప్రసీ పరీక్ష కలెక్టర్

**అనకాపల్లి, పెన్ సత్తా జనవరి 20:** లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్సిడిసి) 2025 పోస్టరును జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ విడుదల చేసారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో ప్రచార పోస్టరును విడుదల చేసి జిల్లా కలెక్టరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జనవరి 20 వ తేది నుండి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు 14 రోజులపాటు జరుగనున్న ఈ సర్వేలో సిహెచ్వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి, ప్రతి కుటుంబ సభ్యుడిని పరీక్షించాలన్నారు. అనుమానిత కేసులను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి పంపించాలని సూచించారు. అవసరమైన వారికి చికిత్స అందించాలని తెలిపారు. ఈ కార్యక్రముంలో జాయింటు కలెక్టరు ఎం . జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.






# తిమ్మరాజు పేట పారిశుద్ధ్యన్ని పరిశీలించిన సుందరపు

**మునగపాక, పెన్ సత్తా, జనవరి 20:** మండలం లోని తిమ్మరాజుపేట గ్రామంలో శాసనసభ్యులు సుందర విజయకుమార్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న బొందల ఆక్రమణల పై, మురికి నీరు రోడ్ల పై రావడం, శానిటేషన్ లోపాన్ని పరిశీలించి అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు అయితే ప్రజలు డెంగ్యూ దోమలు బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు అనారోగ్య పాలవుతారు అని, ఇటువంటి పరిస్థితులను తాను సహించను అని, రాష్ట్ర మఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర పారిశుద్ధ్యనికి పెద్ద పీట వేస్తుంటే, గ్రామాల్లో అధికారులు మురికికి పెద్ద పీట వేస్తున్నారని ఇది సహించరానిది అన్నారు. తాన్ను మరలా వచ్చే వారం నాటికి తిమ్మరాజు పేట గ్రామం వచ్చేటప్పటికి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే అధికారుల పై చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బేమరిశెట్టి శ్రీనివాసరావు, సరగడం శివ, బాపు నాయుడు, బొడ్డేడ వెంకటరమణ, దొడ్డి భాస్కరరావు, బి శెట్టి ఉమాశంకర్, కాంద్రేగుల జగన్, సాగరం జగన్నాథ రావు, పచ్చికూర నర్సింగ రావు, తదుతరి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.







# చిన్నారి వైద్యం కోసం 10 లక్ష మంజూరు చేయించిన మంత్రి సత్య కుమార్

### - కుటుంబానికి మంజూరు పత్రం అందజేసిన మంత్రి సిబ్బంది

**ధర్మవరం, పెన్ సత్తా, జనవరి 20:** కాలేయ సమస్యతో బాధపడుతున్న చిన్నారి కి కాలేయ మార్పిడి చికిత్స కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 10 లక్షలు మంజూరు చేయించడం జరిగిందని, ఎన్డీఏ కార్యాలయ మంత్రి ఇంచార్జ్ హరీష్ బాబు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరం పట్టణం లోని నేసే పేటకు చెందిన కొత్త అనిల్ కుమార్, కొత్త అనిత ల కుమార్తె 3 సంవత్స రాల నిహాన్వి పుట్టుకతో కాలేయ సమస్యతో బాధపడుతుండేది అని, వైద్యులు కాలేయ మార్పిడి చేయించాలి అని తల్లిదండ్రులకు తెలియజేశారు. విషయం విన్న తల్లి దండ్రుల ఆవేదనకు గురయ్యారు. తమ ఆర్థిక పరిస్థితి, ఆపరేషన్ చేయించే స్తోమత లేకపోవడంతో దిక్కు తోచని తల్లిదండ్రులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తమ చిన్నారి చికిత్స కోసం సాయం చేసి కాపాడవలసిందిగా కోరారు. విషయం విన్న మంత్రి హైదరాబాదు లోని గ్లెన్ఈగల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ చిన్నారి కాలేయ మార్పిడి ఆపరేషన్ కోసం హుటాహుటిన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వెంటనే రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. అని తెలిపారు. ఆ విషయాన్ని మంత్రి సిబ్బంది తల్లి దండ్రులకు తెలియ చేస్తూ, దానికి సంబంధించిన మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ చిన్నారి శస్త్ర చికిత్సకు కావాల్సిన సహాయంతో పాటు, మెరుగైన వైద్య సౌకర్యాలను అందించాల్సిందిగా మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆసుపత్రి వారికి ఆదేశించారని తెలియజేసారు. ఆ చిన్నారి శస్త్ర చికిత్స విజయవంతమై త్వరగా కోలుకోవాల్సిందిగా మంత్రి ఆకాంక్షిస్తున్నారని ఆయన తెలియజేశారు. తమ చిన్నారి ప్రాణాలను నిలబెట్టడం కోసం మంత్రి సత్య కుమార్ చేసిన సహాయానికి ఆ చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డోలా రాజా రెడ్డి, ఎర్రజోడు లోకేష్, జుటూరు వెంకటేష్, పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర్, సాకే ఓబ్లేస్ తదితరులు పాల్గొన్నారు.



# సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి -కలెక్టరు విజయ కృష్ణన్

**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 20:** సంపూర్ణ అక్షరాస్యత కొరకు అందరూ కృషి చేయాలని విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశం మందిరం లో వయోజన విద్యా వాచకములు, వాలంటరీ మార్గదర్శకాలు పుస్తకాలను జిల్లా కలెక్టరు ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ వయోజన విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్న ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం ద్వారా గుర్తించబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని తెలిపారు. జిల్లాలో మొదటి దశలో 11,900 మంది అబ్యాసకులను, 1,190 మంది వాలంటీర్లను గుర్తించడం జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయిలో మండల అభివృద్ధి అధికారులు, ఎపిఎం లకు రెండుదశల శిక్షణ పూర్తిచేయడం జరిగిందని, మండల స్థాయిలో వాలంటరీ టీచర్లకు ఒక దశ శిక్షణ పూర్తిచేసి, రెండవ దశ ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామాలలో గల మహిళా స్వయం శక్తి సంఘాల యందు నిరక్ష రాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. వయోజన విద్యా తరగతులు నిర్వహించుటకు అంగన్వాడి కేంద్రాలు, పాఠ శాలలు, పంచాయితీ కార్యాలయాలు, సామాజిక భవనాలు వినియోగించుకోవచ్చునని తెలిపారు. అన్ని మండలాలకు పాఠ్య పుస్తకములు పంపిణీ చేసి, వెంటనే తరగతులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, వయోజన విద్యాశాఖ సహాయ సంచాలకులు డి. చిన్ని కృష్ణ, డిఆర్డిఎ ప్రోజెక్టు డైరెక్టరు కె. శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఎస్. మంజులవాణి పాల్గొన్నారు.



# టిడిపి మహిళా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన సందా రాఘవ

**ధర్మవరం, పెన్ సత్తా, జనవరి 20:** పట్టణము లోని 23 వ వార్డుకు చెందిన టిడిపి మహిళా కార్యకర్త హయాబీ తమ్ముడు కాజు అనారోగ్యం కారణముతో మృతి చెందడం జరిగింది. మృతుడు కార్పెంటర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నిరుపేద కుటుంబం, మరణించిన వ్యక్తి కొడుకు అనారోగ్య సమస్యలతో మతి స్థిమితం లేకుండా మంచానికే పరిమితం కావడం, అదేవిధంగా అతని భార్య కూడా అనారోగ్య పరిస్థితుల కారణం చేత ఏ పని చేయలేక ఆర్థిక ఇబ్బందులతో గురవుతున్నారు. సమాచారం అందుకున్న తారక్ చేయూత ట్రస్ట్ అధ్యక్షులు రామాంజి, పట్టణ ప్రముఖులు, దాన శీల హృదయుడు సంద రాఘవ కు సమాచారాన్ని అందించారు. తక్షణమే ఆ కుటుంబ పరిస్థితులు విన్న దాత విన్న వెంటనే 16 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. దీంతో మృతుని కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించ లేని పరిస్థితుల్లో ఉండటంతో వారికి ఆర్థిక సహాయమును చేయడం జరిగిందని తారచేయుత ట్రస్ట్ సభ్యులు తెలిపారు.



# ఎస్పీ వకుల్ జిందల్ ని పూర్వకంగా కలిసిన జి.భవ్య

**విజయనగరం, పెన్ సత్తా, జనవరి 20:** జిల్లా బొబ్బిలి సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా జనవరి 20 న జి.భవ్య బాధ్యతలు చేపట్టారు. అనంతరం, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ని పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛంను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపి, శిక్షణ, కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు. బొబ్బిలి సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరి రక్షణకు కృషి చెయ్యాలని, విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎస్పీని ఆదేశించారు.



# నిరుద్యోగ యువత పీఎం ఇంటర్న్ షిప్ పథకం వినియోగించు కోవాలి

**- జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి**

**అనకాపల్లి, పెన్ సత్తా జనవరి 20 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం ఇంటర్న్ షిప్ పథకం నవెరీదుకు నేడే ఆఖరు రోజని, జిల్లా లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎం.జాహ్నవి పిలువునిచ్చారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో పీఎం ఇంటర్న్ షిప్ పథకం పోస్టరును ఆవిష్కరించారు. ఈ సంధర్బంగా మాట్లాడుతూ సాధ్యమైనంత ఎక్కువ మంది యువత ఈ పథకాన్ని వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. గోవిందరావు మాట్లాడుతూ ప్రతి ఇంటర్న్ కు 12 మాసాల పాటు శిక్షణ ఇస్తూ, నెలవారీ సహాయం కింద రూ.4,500/-లు, పరిశ్రమల ద్వారా రూ.500/-లు, సంఘటనల కోసం రూ.6,000లు వన్-టైమ్ గ్రాంట్ మంజూరుచేయడం జరుగుతుందని అన్నారు. అలాగే శిక్షణ కాలంలో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన మరియు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద బీమా కవరేజీ వర్తిస్తుందని తెలిపారు. ఇంటర్న్ షిప్ అనంతరం ప్రతిష్టాత్మకమైన కంపెనీలలో ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21 లోగా https://pminternship.mca.gov.in/login/ లింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ వంటి డిగ్రీలు పూర్తిచేసిన 21 నుంచి 24 సంవత్సరాలు వయస్సు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9010793492 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు



# పాడి రైతులు పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి

**- మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి**

చీడికాడ, పెన్ సత్తా, జనవరి 20: పాడి రైతులు పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించు కోవాలని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి తెలిపారు. సోమవారం చీడికాడ మండలం చెట్టుపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశు ఆరోగ్య శిబిరాల కార్యక్రమాన్ని శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ శిబిరం లో పాడి పశువులకు, పెయ్యలకు, గొర్రెలు, మేకలకు స్వయంగా నట్టల నివారణ మందులను శాసనసభ్యులు తన చేతుల మీదుగా పట్టించారు. పశు ఆరోగ్య శిబిరాలు గోడ పత్రిక ను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ ద్వారా రైతులు అధిక ఆదాయం పొందాలని, పాడి రైతులు మెళకువలు అలవరచుకొని పాడిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. బి . రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఈ నెల 20 నుండి 31 వరకు పశు ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ పశు ఆరోగ్య శిబిరంలో 15 పశువులకు సాధారణ చికిత్స, 25 గర్భ కోస చికిత్సలు,15 పెయ్యలకు, 21 పశువులకు నట్టల నివారణ,310 గొర్రెలకు మందులు అందజేసారు.










ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా .చిట్టి నాయుడు, మండల అభివృద్ధి అధికారి హేమ సుందర రావు, పెదగొగాడ పశు వైద్యాధికారిణి డా. రాఘవమ్మ, చెట్టుపల్లి గ్రామసర్పంచ్ గణేష్, ఎం. పి. టి. సి తిరుమలనాయుడు, మాజీ జడ్పీటీసీ పోతల రమణమ్మ, విశాఖ డైరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, పేరపు కొండబాబు, రెడ్డి రాము, పశువైద్య సిబ్బంది వర్మ, సౌజన్య, సాయి, రాజేష్, గంగు నాయుడు, అర్జున మూర్తి ఇతరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

**- ఇదే అల్లా ఇచ్చిన సందేశం పరిటాల శ్రీరామ్**
**- తాడిమర్రిలో జరిగిన ఇస్తెమా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరామ్**

**ధర్మవరం పెన్ సత్తా జనవరి 20:** ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుస్తూ సంతోషంగా జీవించాలన్నదే అల్లా ఇచ్చిన సందేశమని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. తాడిమర్రి మండల కేంద్రంలో జరిగిన ముస్లింల ఇస్తెమా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురు మత పెద్దలు ఇందులో ప్రార్ధనలు చేయడంతో పాటు అల్లా బోధనలు వివరించారు. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి ప్రాంతాల నుంచి వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. పరిటాల శ్రీరామ్ కు ఇస్తెమా నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన ముస్లిం సోదరులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అక్కడ మత్త పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. శ్రీరామ్ ను పలుకరించేందుకు పెద్ద ఎత్తున ముస్లిం యువత పోటీ పడ్డారు. ప్రతి ఒక్కర్నీ శ్రీరామ్ పలుకరిస్తూ ముందుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో ముస్లింలకు సంబంధించిన ఇంత పెద్ద కార్యక్రమం జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ మత పెద్దలు ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ వినడమే కాకుండా పాటించాలన్నారు. మనిషి స్వార్థం, ఈర్ష, ద్వేశాలతో ఉండకూడదని, ప్రతి ఒక్కరితో మంచిగా మెలుగుతూ, పలువురుకి సాయం చేయాలని, మత పెద్దలు కూడా ఇదే సందేశాన్నిస్తున్నారని శ్రీరామ్ అన్నారు. కార్యక్రమం వచ్చి పాల్గొన్న ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు.



# బాధితుల సమస్యలను తక్షణమే చట్ట పరిధిలో పరిష్కరించాలి ఎస్పీ

**విజయనగరం, పెన్ సత్తా, జనవరి 20:** జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, సోమవారం నాడు నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను, సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదు దారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 32 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించినవి 4, కుటుంబ కలహాలకు సంబంధించినవి 1, మోసాలకు పాల్పడినట్లుగా 7, ఇతర అంశాలకు సంబంధించినవి 20 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7 దినాల్లో ఫిర్యాదు దారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుల పై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డిసిఆర్బి సిఐ ఎస్.శంకరరావు, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.










# గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి ఏర్పాట్లు

**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 20:** ఉత్తరాంధ్ర లో ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఈ నెల 25 శనివారం నాడు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు తెలియజేశారు. సోమవారం గౌరీ పరమేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 వ తారీఖు న బుధవారం ఆలయం వద్ద గౌరీ పరమేశ్వరుల వార్షిక కల్యాణం, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు భారీ సారి ఊరేగింపు జరుగుతుందని తెలియజేశారు. ఈ ఏడాది సుమారు 37 భారీ స్టేజ్ ప్రోగ్రాములు, 10 నేల వేషాలు, కలకత్తా వారిచే భారీ విద్యుత్ అలంకరణ, మందుగుండు సీతారామయ్య చే భారీ బాణా సంచా హంగామా, మళ్ల జగన్నాథ్ కల్యాణ మండపంలో గురువారం ఉచిత మెడికల్ క్యాంపు జరుగుతుందన్నారు. పండగ రోజు భక్తులు సహాయ సహకారాలతో ఉచిత ప్రసాదం పంపిణీ చేయడం జరుగుతుందని అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు ( చైర్మన్ ), కొణతాల శ్రీనివాసరావు ( కార్యదర్శి ), కొణతాల నూక మహాలక్ష్మినాయుడు ( కోశాధికారి ), కొణతాల ప్రసాద్ ( ఉపాధ్యక్షులు ), పి. వి. రమణ ( కన్వీనర్ ), పి. వి. సత్యనారాయణ ( ఉప కోశాధికారి ), ఉత్సవ నిర్వాహకులు గండేపల్లి మురళి, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, ఎల్లపు వాసు, మద్దాల రాజు, కొణతాల లోకేష్, బుద్ధ తేజ తదితరులు పాల్గొన్నారు.





# మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత

**చోడవరం పెన్ సత్తా జనవరి 20:** గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా చోడవరం మండలంలో తిరుగుతున్న బీహార్ కు చెందిన వ్యక్తిని పోలీసులు అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బీహార్ రాష్ట్రం, నలంద జిల్లాకు చెందిన తౌఫీక్ గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా చోడవరం ప్రాంతంలో తిరుగుతుండడంతో స్థానిక పోలీసులు ప్రేమ సమాజంలో ఉంచి అతని సమాచారం సేకరించి వారి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో అతనికి సంబందించిన వాళ్ళు రావడంతో పోలీసులు వారికి అప్పించారు. ఈ సందర్భంగా అతని కుటుంబ సభ్యులు చోడవరం సిఐ పి.అప్పలరాజుకు, ఎస్సీలు నాగ కార్తీక్, బి.జోగారావులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



# క్యాన్సర్‌ను షేకాడించే ఏకైక వెజిటబుల్


ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయల్లో బ్రోకోలీ ముఖ్యమైనది. దీనిని ఆహారంలో తీసుకుంటే క్యాన్సర్ తో సహా ఎన్నో ప్రాణాంతక వ్యాధుల ముప్పు నుంచి తేలికగా బయట పడొచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. బ్రోకలీలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వ్యాధుల కారకాలతో పోరాడి రక్షణ ఇస్తాయి. బ్రోకలీ గురించి చాలా మందికి తెలుసు. ఇది నోటికి రుచిగా ఉండటమే కాకుండా శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే పోషకాల పవర్‌హౌస్. రోగనిరోధక శక్తిని పెంచడం నుంచి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడం వరకు అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు ఇది దివ్యౌషధంగా పనిచేస్తుంది. అలాగే ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది.బ్రోకలీ గురించి చాలా మందికి తెలుసు. ఇది నోటికి రుచిగా ఉండటమే కాకుండా శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే పోషకాల పవర్‌హౌస్. రోగనిరోధక శక్తిని పెంచడం నుంచి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడం వరకు అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు ఇది దివ్యౌషధంగా పనిచేస్తుంది. అలాగే ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. బ్రోకోలీ



జీర్ణక్రియ, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అదనంగా, ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. బ్రోకలీలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఆర్థరైటిస్ ఉన్నవారిలో కీళ్ల నొప్పులకు కారణమయ్యే ఎంజైమ్‌లను అడ్డుకుంటుంది. బ్రోకలీలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరానికి వివిధ మార్గాల్లో సహాయపడతాయి. ఇందులో విటమిన్ సి ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తికి మంచిది. బ్రోకలీలో కాల్షియం, విటమిన్ K ఉన్నాయి. ఈ రెండూ ఎముకల ఆరోగ్యానికి, బోలు ఎముకల వ్యాధి నివారణకు ముఖ్యమైనవి. ఇందులో ఫైబర్స్, ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలో రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. అలాగే రక్తనాళాలు దెబ్బతినకుండా కాపాడుతుంది. బ్రోకలీ జీర్ణక్రియకు సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. అతిగా తినడాన్ని కూడా నివారిస్తుంది. కాబట్టి మీరు బరువు తగ్గాలనుకుంటే ఈ కూరగాయలను మీ ఆహారంలో తప్పకుండా చేర్చుకోండి. ఇది శరీర బరువును తగ్గించడంలో సహాయపడుతుంది

# వేడినీరు, చల్లటినీరు ఏది మంచిది..?

ఉదయాన్నే ఖాళీ కడుపుతో నీరు తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది కడుపును శుభ్రం చేయడం ద్వారా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఉదయం 2-3 గ్లాసుల గోరువెచ్చని నీరు తాగడం మంచి అలవాటు. ఇది మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలను నివారిస్తుంది. ఈ అలవాటు మీ శరీరానికి శక్తిని అందించి, చర్మం కూడా మెరిసేలా చేస్తుంది. ప్రతిరోజూ ఉదయం నీరు తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. కానీ చాలామంది కొన్ని చిన్న చిన్న తప్పులను చేస్తుంటారు. కొందరు కూర్చొని నీరు తాగుతారు, మరికొందరు నిలబడి నీరు తాగుతారు.



ఇది మన ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కడుపులో ఒత్తిడి పెరిగి, శరీరానికి అవసరమైన శుభ్రత పొందేందుకు సరైన విధంగా నీరు తాగడం చాలా ముఖ్యం. మనం ఉదయం లేచాక, మొదటగా నీరు తాగడం శరీరానికి అత్యంత ఉపయోగకరమైనది. చిన్నప్పటి నుంచి మన పెద్దలు బ్రెష్ చేసిన తర్వాత నీరు తాగాలని చెబుతారు. ఇది నిజంగా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఉదయం నీరు తాగకుండా ఉంటే, కడుపు సరైన విధంగా పనిచేయదు, ఇందులో గ్యాస్, నొప్పులు, ఇతర అనారోగ్యాలు ఏర్పడుతాయి. అలాంటి సమస్యలను నివారించేందుకు ఉదయం లేచిన తర్వాత నీరు తాగడం చాలా అవసరం. ఉదయాన్నే మనం కూర్చొని నీరు తాగడం చాలా మంచిది. ఎందుకంటే, ఈ విధానంలో కడుపులో ఒత్తిడి తగ్గుతుంది. రాత్రి నిద్ర సమయంలో మన నాలుకలో బ్యాక్టీరియా ఉత్పత్తి అవుతుంది. దీనిని నీరు తాగడం ద్వారా బయటకు పంపవచ్చు. కడుపులో ఎక్కువ ఒత్తిడి లేకుండా, కడుపు శుభ్రంగా ఉంటుంది. ఉదయం లేచాక, కనీసం 2-3 గ్లాసుల నీరు తాగడం మంచిది. ఇది కడుపును నింపి, శరీరానికి శక్తి ఇవ్వడం మొదలు చేస్తుంది. రాత్రిపూట నీరు తాగకపోవడం వల్ల, ఉదయం నీరు తాగడం కడుపును శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. మీరు 2-3 గ్లాసులు తాగలేకపోతే, కనీసం 1 గ్లాసు తాగిన సరిపోతుంది. ఉదయం వేడి లేదా గోరువెచ్చని నీరు తాగడం కడుపును మరింత శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. వేడి నీరు తాగడం వల్ల, శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీనివల్ల, కడుపు సాఫీగా పనిచేస్తుంది. ఆరోగ్య సమస్యలు తగ్గి, శరీరంలో వేడి పెరిగి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

# వింటర్‌లో వాకింగ్ హెల్త్‌కి ఎంతో బెటర్?


వాకింగ్ చేయడం వల్ల గుండెపనితీరు మెరుగుపడుతుంది. కొలెస్ట్రాల్, బీపీ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే చలికాలంలో కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. ఎముకలు విరిగే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. కనుక చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల ఎముకల సాంద్రత పెరుగుతుంది. ఎముకలు ధృడంగా తయారవుతాయి. నొప్పులు తగ్గుతాయి. అలాగే వాకింగ్ చేయడం వల్ల నిద్రలేమి తగ్గుతుంది. రాత్రి పూట చక్కగా



నిద్రపడుతుంది. అలాగే చలికాలంలో మధ్యాహ్న సమయంలో నడవడం వల్ల శరీరానికి తగినంత విటమిన్ డి లభిస్తుంది. దీంతో ఎముకలు ధృడంగా తయారవుతాయి.ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు తగ్గుతాయి. చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్ ల బారిన పడకుండా ఉంటాము. అలాగే వాకింగ్ చేయడం వల్ల బరువు పెరగకుండా ఉంటాము. చలికాలంలో బరువు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కనుక వాకింగ్ చేయడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. అలాగే చలికాలంలో శరీరంలో జీవక్రియలు నెమ్మదిస్తాయి. కనుక వాకింగ్ చేయడం వల్ల శరీరంలో జీవక్రియల రేటు పెరుగుతుంది. జీర్ణశక్తి కూడా పెరుగుతుంది. అంతేకాకుండా చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది.చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ అనే సమస్య బారిన పడకుండా ఉంటాము. వాకింగ్ చేయడం వల్ల ఎండార్ఫిన్ అనే ఫీల్ గుడ్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. దీంతో మానసిక స్థితి మెరుగుపడుతుంది.చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. హార్ట్ ఎటాక్, గుండెపోటు వంటి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. అలాగే వాకింగ్ చేయడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. బీపీ, షుగర్ వంటి వ్యాధులు అదుపులో ఉంటాయి. ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు తగ్గుతాయి. శరీర ఆరోగ్యం మెరుగుపడుతుంది. వాకింగ్ చేయడం వల్ల ఇలా చాలా రకాలుగా మనం ప్రయోజనాలను పొందవచ్చు.

# పాలు తాగడం వల్ల ఇన్ని ప్రయోజనాలా!

రోజూ ఒక గ్లాస్ పాలు తాగితే ఎన్ని ప్రయోజనాలు ఉంటాయో తెలిస్తే షాకవుతారు. రోజు పాలు తాగడం వల్ల ఈ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. మానసిక ఆరోగ్యానికి పాలు మంచిదని భావిస్తారు. పాలు తీసుకోవడం వల్ల అల్జీమర్స్ రిస్క్ తగ్గుతుందని అనేక పరిశోధనల్లో తేలింది. పాలు పోషకాల భాండాగారం. దీన్ని తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.. మానసిక ఆరోగ్యానికి పాలు మంచిదని భావిస్తారు. పాలు తీసుకోవడం వల్ల అల్జీమర్స్ రిస్క్ తగ్గుతుందని అనేక పరిశోధనల్లో తేలింది. స్కిమ్డ్ డైరీ, పులియబెట్టిన డైరీ, మజ్జిగ మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అందువల్ల, అల్పాహారంలో ఓట్స్‌తో కొద్దిగా పాలు తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది. పాలు పోషకాల భాండాగారం. దీన్ని తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. పాలు పిల్లలకే కాదు మహిళలకు కూడా (మిల్క్ బెనిఫిట్స్) మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అన్ని వయసుల వారు ప్రతిరోజూ పాలు తాగాలి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒక కప్పు పాల నుండి శరీరానికి 2 శాతం ఆరోగ్యకరమైన కొవ్వు, 122 కేలరీలు, 8 గ్రాముల ప్రోటీన్, 3 గ్రాముల సంతృప్త కొవ్వు, 12 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 12 గ్రాముల సహజ చక్కెర లభిస్తుంది. విటమిన్ బి12 రోజువారీ అవసరాలలో 50%, కాల్షియం రోజువారీ అవసరాలలో 25%, పొటాషియం, విటమిన్ డి రోజువారీ అవసరాలలో 15% కలిగి



ఉంటుంది. పాలలో కాల్షియం, విటమిన్ డి పుష్కలంగా లభిస్తాయి. ఎముకల ఆరోగ్యానికి రెండు పోషకాలు చాలా ముఖ్యమైనవి. కాల్షియం ఎముకలను బలపరుస్తుంది. విటమిన్ డి శరీరానికి సరఫరా చేయబడిన ఆహారాల నుండి కాల్షియంను గ్రహించడంలో సహాయపడుతుంది. పాలు తాగడం వల్ల ఎముకలు ఆరోగ్యంగా, బలంగా తయారవుతాయి. పాలు తాగడం వల్ల కూడా బరువు తగ్గవచ్చు. పాలలో ఉండే కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వుల సమతుల్య కలయిక బరువు తగ్గడంపై ప్రభావం చూపదు. ప్రోటీన్, కొవ్వు కారణంగా బరువు తగ్గడానికి పాలు సహాయపడుతుంది. కార్బోహైడ్రేట్లు శరీరానికి శక్తిని అందిస్తాయి. శరీరాన్ని చురుకుగా ఉంచడంలో సహాయపడతాయి. పాలు తాగడం వల్ల ఆకలి కూడా తగ్గి కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారు ప్రతిరోజూ ఒక గ్లాసు తక్కువ కొవ్వు పాలు తాగడం మంచిది.

# ఆన్‌లైన్‌లో చికెన్ కొంటున్నారా..?

చికెన్ కొత్తగా ఉందా లేదా పాడైనదా అని గుర్తించడం చాలా ముఖ్యం. తాజా చికెన్ గులాబీ రంగులో ఉంటే మంచిదని, పసుపు రంగు ఉంటే దాని మీద ఫంగస్ చేరిందని తెలుసుకోవాలి. వాసన ద్వారా కూడా కొత్తగా ఉందా లేదా చెడిపోయిందా అని తేల్చవచ్చు. రబ్బరులా తయారైన చికెన్ తినడం వల్ల శారీరక సమస్యలు వస్తాయి. ఆన్‌లైన్‌లో ఫ్రోజెన్ చికెన్ ఆర్డర్ చేసే ముందు నాణ్యత చెక్ చేయాలి. తక్కువ ధరకే తీసుకుంటే అది పాడై ఉండే అవకాశం ఉంది. పాడైన చికెన్ వలన ఫుడ్ పాయిజన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. చికెన్ కొనడంలో చాలా మంది చిన్నచిన్న జాగ్రత్తలు పాటించరు. అది తాజాగా ఉందా లేదా పాడైనదా అని గమనించకుండా తీసుకుంటారు. ఈ అలవాటు మీ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రత్యేకించి రెడీమేడ్ చికెన్ కొనేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండటం అవసరం. ఆ జాగ్రత్తలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. చికెన్ తాజాగా ఉందో లేదో తెలుసుకోవడానికి దాని రంగు చాలా ముఖ్యమైన సూచన. లేత పసుపు రంగులో చికెన్ కనిపిస్తే దాని మీద ఫంగస్ చేరిందని అర్థం. అటువంటి



చికెన్ తీసుకోవటం ఆరోగ్యానికి హానికరం. వాసన కూడా చికెన్ తాజాదనాన్ని గుర్తించడానికి ఉపయోగపడే మరో ముఖ్యమైన చిట్కా. తాజా చికెన్ చాలా మంచిగా వాసన వస్తుంది. కానీ కుళ్లిన వాసన వస్తే మాత్రం అది పాడయ్యిందని నిర్ధారించవచ్చు. కాబట్టి కొనేటప్పుడు స్మెల్ ను తప్పక గమనించండి. కొన్ని సందర్భాల్లో కొనేటప్పుడు కొత్తగా ఉన్నట్లు కనిపించిన చికెన్ వండిన తర్వాత రబ్బరు మాదిరిగా అవుతుంది. ఇది దాని నాణ్యత లోపం సూచిస్తుంది. అటువంటి చికెన్ తినడం వల్ల శారీరక సమస్యలు ఏర్పడవచ్చు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఆర్డర్ చేయడం సాధారణమైపోయింది. అయితే ఆన్‌లైన్ ద్వారా ఫ్రోజెన్ చికెన్ తీసుకునే పరిస్థితుల్లో చాలా జాగ్రత్తలు అవసరం. ఫ్రోజెన్ చికెన్ సరిగ్గా నిల్వ చేయలేకపోతే అది పాడైపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆన్‌లైన్ ఆర్డర్ చేసే ముందు నాణ్యతపై దృష్టి పెట్టండి. చిన్నధరలో చికెన్ లభిస్తే తీసుకుందాం అని అనుకునే ముందు దాని నాణ్యతను చెక్ చేయడం చాలా ముఖ్యం. టేస్ట్‌తో పాటు ఆరోగ్యానికి మేలు చేసే చికెన్‌ను ఎంపిక చేయడం అవసరం. కొన్ని సార్లు తక్కువ ధరకే పాడైన చికెన్ అమ్మే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎప్పుడు నాణ్యతను మొదట చూడండి. పాడైన చికెన్ తినడం వల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే ఛాన్స్ ఉంది. కడుపు నొప్పి, వాంతులు, డయేరియా వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇది గమనించకపోతే శరీరంపై దీర్ఘకాలిక ప్రభావాలు కూడా చూపవచ్చు. నాన్ వెజ్ ప్రియులకు తాజా చికెన్‌ను గుర్తించడానికి పై చిట్కాలు చాలా ఉపయోగపడుతాయి. మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు రుచికరమైన ఆహారాన్ని కూడా ఆస్వాదించవచ్చు.

# అక్కడ హనుమంతుడే వైద్యుడు..

దేవుడు నిజంగానే ఉన్నాడా.. మనిషికి సమస్య వస్తే నేను ఉన్నాను అంటూ భరోసా ఇస్తాడా అంటే.. నాస్తికులు కొంతమంది శాస్త్రవేత్తలు దేవుడు లేడు అని చెబుతారు. కానీ ఎక్కువ మంది మాత్రం దేవుడు ఉన్నాడు అని బల్లగుద్ది మరి చెబుతూ ఉంటారు. నీకు దేవుడి అవసరం ఉన్నప్పుడు తప్పకుండా నీ కోసం వస్తాడు అని చెబుతూ ఉంటారు. దేవుడు ఉన్నాడు అనే నమ్మకం మనుషుల్లో బలంగా ఉంది. కాబట్టి ప్రస్తుతం ఎన్నో మసీదులు గుళ్ళు చర్చిల్లో పూజలు జరుగుతున్నాయి. నేటి సభ్య సమాజంలో నిజంగానే దేవుడు ఉన్నాడు అన్నదానికి నిరూపించే విధంగా కొన్ని ఘటనలు వెలుగులోకి వస్తూ ఉన్నాయి. ఇప్పుడు మనం మాట్లాడుకోబోయేది కూడా ఇలాంటి తరహా ఘటన గురించే. ఇటీవల కాలంలో చాలా మంది క్యాన్సర్ అనే మహమ్మారి బారిన పడుతున్నారు. ఎన్ని మందులు వాడిన ఆసుపత్రులు చుట్టూ తిరిగిన



క్యాన్సర్ ద్వారా నుంచి బయటపడలేకపోతున్నారు. కానీ అలాంటి వారు మధ్యప్రదేశ్ లో ఉన్న ఒక గుడికి వెళ్తే మాత్రం రోగాలు మటుమాయమవుతాయట. ఆ గుడి పేరు హనుమాన్ క్లినిక్. అదేంటి అక్కడ హనుమాన్ అనే పేరు పెట్టుకునే డాక్టర్ ఉంటాడా అంటారా.. డాక్టర్ కాదు సాక్షాత్ ఆంజనేయస్వామి అక్కడ వైద్యం చేస్తాడని స్థానికులందరూ కూడా చెబుతూ ఉంటారు. మధ్యప్రదేశ్లోని బెండ్ దంద్రువ దానయ్ పేరుతో ఒక హనుమాన్ ఆలయం ఉంది. ఈ గుడిలో ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు వస్తూ ఉంటారు. ఇక ఆంజనేయస్వామిని డాక్టర్ బజరంగబలిగా పూజిస్తారు. స్వామినీ దర్శించుకుని ఆయన పాదాల వద్ద ఉన్న నీరు తాగితే క్యాన్సర్ లాంటి రోగాలు కూడా నమ్ముతాయట. దీంతో ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒకసారైనా ఈ ఆలయాన్ని దర్శించుకోవాలని అనుకుంటూ ఉంటారు. ఇప్పుడు వరకు అక్కడ హనుమంతుడికి పూజలు చేసే పూజరులు, అక్కడికి వచ్చి వెళ్లిన భక్తులు కూడా ఇలా ఈ హనుమంతుడని దర్శించుకుంటే పెద్ద పెద్ద వ్యాధులు కూడా నయమవుతాయని చెబుతూ ఉండడం గమనార్హం. క్యాన్సర్ లాంటి మహమ్మారి కూడా ఇప్పటివరకు ఎంతోమంది కి తగ్గిందట. గతంలో ఒక భక్తుడికి స్వయంగా వైద్యం చేయడానికి హనుమంతుడు వైద్యుడు రూపంలో వచ్చాడని ప్రతితి.

# ట్రంప్ పాలన పట్ల ఇయులో భయాందోళనలు!

**బ్రస్సెల్స్ :** అమెరికాలో ట్రంప్ అధికారం చేపట్టడం పట్ల యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు కొన్ని పెదవి విరిచాయని, మిగతా దేశాల్లో కూడా మిశ్రమ ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్నాయని ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. ట్రంప్ వచ్చిన తర్వాత కేవలం అమెరికాకే మంచి జరగడం కాకుండా ఉక్రెయిన్‌లో, మధ్య ప్రాచ్యంలో శాంతి నెలకొనడానికి దోహదపడవచ్చని మరికొందరు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తన స్వప్రయోజనాలు నెరవేర్చుకునే దిశగా 'అమెరికా ఫస్ట్' అన్న ట్రంప్ నినాదం యూరప్‌ను తీవ్రంగా భయపెడు తోంది. ఇయు వ్యాప్తంగా 22శాతం మంది అమెరికాను మిత్రపక్షంగా భావిస్తుండగా, 51శాతం మంది అవసరమైన భాగస్వామిగా పేర్కొంటున్నాయి. తొమ్మిది శాతం మంది ప్రత్యర్థిగా పేర్కొంటుండగా, మూడు శాతం మంది ప్రతికూల శక్తిగా భావిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 24 దేశాల్లో 28,549మందిపై విదేశీ సంబంధాలపై యురోపియన్ కౌన్సిల్ (ఇసిఎఫ్ఆర్), ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలు సంయుక్తంగా ఈ సర్వే నిర్వహించాయి. . ట్రంప్ రెండో సారి అధికార పగ్గాలు చేపట్టనుండడం పట్ల భారత్‌లో మోడీ ప్రభుత్వం సంతోషంగా వుంది. ఇక అమెరికా మిత్రపక్షాలైన బ్రిటన్, కొరియా రిపబ్లిక్, ఇయు సభ్య దేశాల్లోని ప్రజలైతే ట్రంప్ పాలన పట్ల అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. యురోపియన్ మిత్రపక్షాలే ఎక్కువ నిరాశావాదాన్ని ప్రకటించా యి. రాబోయే ట్రంప్ ప్రభుత్వం వల్ల అమెరికన్లకు ఎదురుదెబ్బ తగులుతుందని, అంతర్జాతీయ ఘర్షణల పరిష్కారానికి కూడా విఘాతమేర్పడవచ్చని పలువురు పేర్కొన్నారు. ఇక రిపబ్లిక్ ఆఫ్ కొరియాలో అయితే ట్రంప్ పట్ల ఇయు కన్నా ఎక్కువ వ్యతిరేకత నెలకొంది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఒక మోస్తరు దేశాలన్నీ ప్రపంచ పోలీస్‌గా అమెరికాను ఇంకెంత మాత్రమూ అనుమతించేది లేదని చెబుతున్నాయి. ఇయులోనే మరో సెక్షన్ ట్రంప్‌ను స్వాగతిస్తోంది.



# కేంద్రం భూములిస్తే శానిటేషన్ వర్కర్లకు ఇళ్లు కట్టిస్తాం

**న్యూఢిల్లీ పెన్ సతా:** కేంద్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే, ఢిల్లీ ప్రభుత్వం శానిటేషన్ వర్కర్లకు ఇళ్లు కట్టించి ఇస్తుందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం లేఖ రాశారు. ఢిల్లీలోని పారిశుధ్య కార్మికులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు సబ్సిడీపై భూమి కేటాయించాలని ఆ లేఖలో కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పారిశుధ్య కార్మికులు మురికివాడల్లో నివసిస్తుండటం చూశాను. దీనిపై ప్రధానికి లేఖ రాశాను. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఒక స్కీమ్ ప్రవేశపెట్టాలని కోరారు. ఆ పథకం కింద సబ్సిడీతో భూములను కేంద్రం కేటాయిస్తే అప్పుడు ఢిల్లీ ప్రభుత్వం వారికి ఇళ్లు కట్టించి ఇస్తుంది' అని తెలిపారు. తొలుత ఎన్‌డిఎంసి, ఎంసిడి పారిశుధ్య కార్మికులకు కేంద్రం భూమి కేటాయిస్తే, వారి వేతనాల నుంచి ఇన్‌స్టాల్‌మెంట్లుగా ఆ మొత్తాన్ని చెల్లిస్తామని చెప్పామని పేర్కొన్నారు. ఇది పేద ప్రజలకు ఉద్దేశించిన పథకం అయినందున ప్రధాని అంగీకరిస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత మిగతా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయవచ్చునని చెప్పారు.



# మొదటిసారి గృహ రుణం తీసుకుంటున్నారా?

హోమ్ లోన్ తీసుకుంటున్నప్పుడు వడ్డీ రేటు మీ లోన్ కాలపరిమితి, ప్రాసెసింగ్ ఫీజులు, లోన్ నిబంధనలు మొదలైన వాటిపై ఎక్కువ రుణదాతలు అందించే డీల్‌లను ఎల్లప్పుడూ సరిపోల్చండి. లోన్ రేటులో స్వల్ప వ్యత్యాసం కూడా లోన్ వ్యవధిలో చాలా వరకు ఆదా చేయడంలో మీకు సహాయపడుతుంది. సొంత ఇల్లు ఉండాలనేది ప్రతి భారతీయుడి కల. కానీ ప్రతి ఒక్కరూ ఇల్లు కొనేందుకు బ్యాంకు నుంచి గృహ రుణం తీసుకుంటారు. అందువల్ల కొత్త గృహ కొనుగోలుదారులకు గృహ రుణం అత్యంత ప్రాధాన్య ఎంపికలలో ఒకటి. అయితే, హోమ్ లోన్ ప్రక్రియ ద్వారా వెళ్లడం కొంచెం సవాలుగా ఉంటుంది. ముఖ్యంగా మొదటిసారి రుణం తీసుకునే వారికి. మీరు మొదటి సారి గృహ రుణం తీసుకుంటున్నట్లయితే, గృహ రుణం తీసుకునే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. గృహ రుణం కోసం దరఖాస్తు చేయడానికి ముందు, మీరు అర్హత సాధించారని నిర్ధారించుకోవడానికి క్రెడిట్ స్కోర్ అవసరాలను తనిఖీ చేయండి. మీ క్రెడిట్ స్కోర్ మీ రుణ అర్హత, వడ్డీ రేటుపై ప్రభావం చూపుతుంది. అందుకే మీరు 750 లేదా అంతకంటే ఎక్కువ స్కోర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. మీ స్కోర్ తక్కువగా ఉంటే, రుణం కోసం దరఖాస్తు చేయడానికి ముందు దాన్ని మెరుగుపరచడానికి చర్యలు తీసుకోండి. హోమ్ లోన్ తీసుకునేటప్పుడు మీ ఆర్థిక సామర్థ్యాన్ని ముందుగానే అంచనా వేయండి. మీ హోమ్ లోన్ జుఏ×, మీ నెలవారీ ఆదాయంలో 40% మించకూడదు. అందుకే మీ ఆదాయం ఆధారంగా మీరు ఎంత రుణం తీసుకోవచ్చో లెక్కించండి. మీరు ఎంత రుణం తీసుకోవాలో అంచనా వేసేటప్పుడు రిజిస్ట్రేషన్, పన్నులు, బీమా మొదలైన అదనపు ఖర్చులను గుర్తుంచుకోండి. రుణ ప్రక్రియలో భాగంగా, రుణదాతలు సాధారణంగా ఆస్తి విలువలో 10-20% వరకు డౌన్ పేమెంట్‌ను అడుగుతారు. మిగిలిన మొత్తాన్ని రుణంగా ఇవ్వగా, డౌన్ పేమెంట్‌ను రుణగ్రహీత భరించాలి. మీ డౌన్ పేమెంట్ ఎక్కువైతే మీ లోన్ జుఏ×, వడ్డీ తగ్గుతుంది. అందుకే మీరు రుణాన్ని ఖరారు చేసినట్లయితే, డౌన్ పేమెంట్ కోసం ప్లాన్ చేయడం ప్రారంభించండి. హోమ్ లోన్ తీసుకుంటున్నప్పుడు వడ్డీ రేటు మీ లోన్ కాలపరిమితి, ప్రాసెసింగ్ ఫీజులు, లోన్ నిబంధనలు మొదలైన వాటిపై ఎక్కువ రుణదాతలు అందించే డీల్‌లను ఎల్లప్పుడూ సరిపోల్చండి. లోన్ రేటులో స్వల్ప వ్యత్యాసం కూడా లోన్ వ్యవధిలో చాలా వరకు ఆదా చేయడంలో మీకు సహాయపడుతుంది. ప్రకటనలో చూపించే వాటితో పాటు, రుణం ఎల్లప్పుడూ స్పష్టంగా పేర్కొనని అనేక నిబంధనలు, షరతులతో వస్తుంది. అయితే రుణగ్రహీతగా మీరు లోన్ నిబంధనల ఫైన్ ప్రింట్‌ని చదవాలి. తద్వారా మీరు ఏ ఖర్చులు ఇమిడి ఉంటారో మీకు తెలుస్తుంది. ఆలస్య చెల్లింపు, లోన్ ముందస్తు చెల్లింపు లేదా లోన్ ఏదైనా ఇతర అంశాలకు సంబంధించినది కావచ్చు.




# రష్యా-ఇరాన్ భద్రతా ఒప్పందం 'చరిత్రాత్మకం'

**మాస్కో :** రష్యా, ఇరాన్ లు "చరిత్రాత్మక ఒప్పంద"తో తమ సహకారాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకువెళ్లాయని మాస్కోకు చెందిన వాల్డారు డిస్కషన్ క్లబ్‌లో మధ్యప్రాచ్య నిపుణుడు ఫర్హాద్ ఇబ్రహిమోవ్ అన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ శుక్రవారం మాస్కోలో ఒక ప్రధాన ద్వైపాక్షిక భద్రతా ఒప్పందంపై సంతకం చేశారు. రాబోయే 20 సంవత్సరాల పాటు ఈ ద్వైపాక్షిక ఒప్పందంతో ఏర్పడిన వ్యూహాత్మక భాగస్వామ్యం ఆధారంగా రష్యా, ఇరాన్ లు సమగ్ర భద్రత, నావికా, ఆర్థిక, మానవతా సహకారాన్ని పెంచుకుంటాయి. "ఈ ఒప్పందం నిజంగా చారిత్రాత్మకం. రష్యా, ఇరాన్ లు పరస్పర సహకారంలో కొత్త స్థాయికి చేరుకున్నాయి"అని ఇబ్రహిమోవ్ అన్నారు. రెండు బ్రిక్స్ దేశాలు సారూప్య ప్రపంచ ద ృక్పథాలను కలిగివున్నాయని, ఇవి కీలక వ్యూహాత్మక భాగస్వాము లుగా ఉంటాయని ఆయన అన్నారు. మధ్య ప్రాచ్యంలో తమ సంబంధాలను అభివ ృద్ధి చేసుకోవా లనుకునే రష్యా ఇరాన్‌ను అత్యంత విలువైన భాగస్వామిగా చూస్తుంది. "వాస్తవానికి, ఇరాన్ చాలా కాలంగా రష్యాను దాని అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వాములలో ఒకటిగా భావిస్తోంది. కొన్నిసార్లు మాస్కోను మిత్రదేశంగా కూడా అభివర్ణిస్తోంది" అని ఇబ్రహిమోవ్ పేర్కొన్నారు. "అంతర్జాతీయ సంబంధాల వ్యవస్థలో కొత్త ప్రపంచ క్రమాన్ని ఏర్పరచడంలో సహాయపడే శక్తిగావుండే సామర్థ్యం ఇరాన్ కు ఉందని రష్యా భావిస్తోంది" అని ఆయన అన్నారు. ప్రపంచంలోఅమెరికాను సవాలు చేయగల దేశాలలో రష్యా ఒకటి అని, టెహ్రాన్ అమెరికాను "మొత్తం ప్రపంచం, ముఖ్యంగా మధ్యప్రాచ్యం భద్రతకు అతిపెద్ద ముప్పు"గా చూస్తుందని ఆయన అన్నారు. దశాబ్దాలుగా పాశ్చాత్య ఆంక్షల కింద నివసిస్తున్నందున, ఒప్పందంలోని ఆర్థిక సహకార నిబంధనలు ఇరాన్‌కు చాలా ముఖ్యమైనవి అని ఇబ్రహిమోవ్ అన్నారు. అయినప్పటికీ, ఒప్పందంలోని భద్రతా అంశాలు ప్రత్యేకంగా ఏ దేశానికి వ్యతిరేకంగా లేవని ఆయన నొక్కి చెప్పారు.



# నైజీరియాలో పేలిన పెట్రోల్ ట్యాంకర్

**అబూజ:** ఉత్తర మధ్య నైజీరియాలో ఓ పెట్రోల్ ట్యాంకర్ పేలి దాదాపు 70మంది మరణించినట్టు అధికారులు శనివారం ధ్రువీకరించారు. నైజర్ రాష్ట్రంలోని సులేజా ప్రాంతంలో కొంతమంది జనరేటర్ ఉపయోగించి ఓ ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి పెట్రోల్ పంపు చేస్తున్న క్రమంలో ఈ పేలుడు జరిగింది. పెట్రోల్‌ను పంపు చేస్తున్న సిబ్బందితో పాటు చుట్టుపక్కల పదుల మీటర్ల దూరంలో ఉన్నవారు కూడా మరణించినట్టు నైజీరియా అత్యవసర ప్రతిస్పందన ఏజెన్సీ వెల్లడించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఆఫ్రికా ఖండంలోనే అత్యంత జనాభా కలిగిన నైజీరియాలో సరుకు రవాణాకు సమర్థవంతమైన రైల్వే వ్యవస్థ లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. గతేడాది సెప్టెంబర్‌లో నైజర్ రాష్ట్రంలో పెట్రోల్ ట్యాంకర్, ట్రక్కు ఢకొనడం వల్ల దాదాపు 48మంది మ ృతిచెందారు. నైజీరియా ఫెడరల్ రోడ్ సేఫ్టీ లెక్కల ప్రకారం, 2020లో 1531 పెట్రోల్ ట్యాంకర్ ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాల్లో 535 మంది మరణించారు, 1142 మంది గాయపడ్డారు.



# భారత్‌లో వేగంగా ఈవీ రంగం వృద్ధి.. మరో ఐదేళ్లల్లో డబుల్..!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఈవీ రంగం కొత్త పుంతలు తొక్కుతుంది. పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ దెబ్బకు దేశాలన్నీ తమ ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలను ఇస్తూ వాటి వినియోగాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశంలో ఈవీ రంగం వృద్ధి వేగంగా సాగుతుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారతదేశ ఆటోమొబైల్ రంగం 2030 నాటికి రెట్టింపు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల గూగుల్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ)కు సంబంధించిన థింక్ మొబిలిటీ నివేదికలో 2030 నాటికి మార్కెట్ విలువ 600 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేశారు. ముఖ్యంగా అదే స్థాయిలో ఈవీ మార్కెట్ కూడా పెరుగుతుందని చెబుతున్నారు. భారతదేశ ఆటోమొబైల్ రంగం 2030 నాటికి రెట్టింపు అవుతుంది. ఆటో రంగ మార్కెట్ క్యాప్ 2030 నాటికి 600 బిలియన్ల డాలర్లకు మించి ఉంటుంది. ఎలక్ట్రిక్, షేర్డ్, కనెక్టెడ్ మొబిలిటీ వంటి అభివృద్ధి చెందుతున్న ఆదాయ వనరుల కారణంగా 100 బిలియన్ల డాలర్ల వ్యాపారం పెరుగుతుందని కూడా పేర్కొంది. ఈ నివేదికపై బీసీ మేనేజింగ్ డైరెక్టర్ నటరాజన్ శంకర్ మాట్లాడుతూ భారతదేశం ఇప్పటికే ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆటోమొబైల్ పరిశ్రమగా ఉందన్నారు. రాబోయే కొన్నేళ్లలో భారత్‌లో మరిన్ని మార్పులు రానున్నాయి. ఈవీ డిజిటల్, ఏఐ రంగాల్లో ప్రపంచ ఆవిష్కరణ భారత్‌లో ఈవీ రంగ వృద్ధికి కారణమవుతాయని పేర్కొన్నారు. నివేదిక ప్రకారం దేశ ఆటో పరిశ్రమ వృద్ధికి ఈవీ చాలా దోహదపడింది. ఎలక్ట్రిక్ ఫోర్-వీలర్స్ (ఈ4డబ్ల్యూ), ఎలక్ట్రిక్ టూ-వీలర్స్ (ఈ2డబ్ల్యూ) మధ్య విభిన్నమైన ప్రాధాన్యతలతో ప్రతి ముగ్గురు కొనుగోలుదారులలో ఒకరు ఈవీ వాహనాలను కొనుగోలు చేయాలని ఆలోచిస్తున్నారు. ఈ4డబ్ల్యూ కొనుగోలుదారులు అధిక సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తారు. అదే సమయంలో ఈ2డబ్ల్యూ కస్టమర్‌లు సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్లు చేస్తారని నిపుణులు చెబుతున్నారు. అలాగే బీసీజీ మేనేజింగ్ డైరెక్టర్ విక్రమ్ జానకిరామన్ ప్రజల అవసరాల గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కంపెనీలు డిమాండ్‌కు అనుగుణంగా కార్లను తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా డిజిటల్ టెక్నాలజీ, ఏఐ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా కంపెనీలు వాహనాలను యూజర్ ఫ్రెండ్లీగా మార్చాలని సూచిస్తున్నారు. గూగుల్ ఇండియా ఓమ్ని-ఛానల్ బిజినెస్ డైరెక్టర్ భాస్కర్ రమేష్ ఈ నివేదికపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. భారతదేశ ఆటో మొబైల్ పరిశ్రమలో పెనుమార్పు వస్తోందని ఇది మొత్తం పర్యావరణ వ్యవస్థను పునర్నిర్వచించిందని అన్నారు. జెన్ జెడ్, మహిళల నేతృత్వంలో డిజిటల్ షాపింగ్ పెరుగుతుందని, దాంతో పాటు లాభాలను ఆర్జించడానికి కస్టమర్ ప్రాధాన్యతలను మార్చడానికి కొత్త మార్గాలు అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నట్లు వివరిస్తున్నారు.




## చిరు తర్వాత వెంకీనే..



పెన్ సత్తా డెస్క్ :టాలీవుడ్ సీనియర్ హీరోల్లో అనేక రికార్డు మెగాస్టార్ చిరంజీవి పేరు మీదే ఉన్నాయి. ఒకప్పుడు ఆయన చూసిన వైభవమే వేరు. 'ఖైదీ నంబర్ 150'తో రీఎంట్రీ ఇచ్చాక కూడా ఆయన రికార్డుల పరంపర కొనసాగించారు. సీనియర్ హీరోల్లో ఎవరికీ సాధ్యం కాని 100 కోట్ల షేర్‌ను అందుకున్నారు. అలాగే 'వాల్తేరు వీరయ్య'తో రూ.200 కోట్ల గ్రాస్ మార్కును టచ్ చేసిన తొలి సీనియర్ హీరోగానూ రికార్డు సృష్టించారు. ఇప్పుడు విక్టరీ వెంకటేష్ ఒకేసారి చిరుకు సాధ్యమైన రెండు ఘనతలనూ అందుకుంటుండడం విశేషం. సంక్రాంతికి రిలీజై అదిరిపోయే వసూళ్లతో సాగిపోతున్న ఆయన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' మూడో రోజుకే వంద కోట్ల గ్రాస్ మార్కును టచ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడా చిత్రం రూ.200 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని కూడా దాటేస్తోంది. ఆల్రెడీ ఈ చిత్రం రూ.100 కోట్ల షేర్ క్లబ్బులోకి కూడా అడుగు పెట్టింది. టాలీవుడ్ సీనియర్ హీరోల్లో చిరుకు మాత్రమే సాధ్యమైన రూ.100 కోట్ల షేర్, రూ.200 కోట్ల గ్రాస్ మార్కును ఒకేసారి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో అందుకున్నాడు వెంకీ. 'సంక్రాంతికి వస్తున్నాం' ఊపు చూస్తుంటే సీనియర్ హీరోల్లో హైయెస్ట్ గ్రాసర్‌గా నిలవడం కూడా లాంఛనమే. ఈ మూవీ బాక్సాఫీస్ డ్రీమ్ రన్ ఇలాగే కొనసాగితే ఫుల్ రన్లో రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని కూడా అందుకోవడం కష్టమేమీ కాదు. ఆదివారం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక ఓవర్సీస్‌లో సైతం హౌస్ ఫుల్ వసూళ్లతో దూసుకెళ్తోందీ చిత్రం. వచ్చే వారం చెప్పుకోదగ్గ కొత్త సినిమాలేవీ లేవు కాబట్టి రెండో వీకెండ్ అయ్యే వరకు ఈ సినిమా ఊపు కొనసాగడం ఖాయం. ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమా కోసం క్యూలు కడుతుండడంతో ఫుల్ రన్ వసూళ్లు ఊహించని స్థాయిలో ఉండబోతున్నాయి.

## మాది భిన్నమైన జీవితమే తప్ప..

పెన్ సత్తా డెస్క్ : అక్కినేని కుటుంబం లో అతి త్వరలో నే మరో పెళ్లి జరగనుంది. అక్కినేని నాగార్జున రెండో తనయుడు అఖిల్ పెళ్లి కి సిద్ధమవుతున్నారు. దీనికి సంబంధించి కీలక విషయాన్ని నాగార్జున వెల్లడించారు. జైనాబ్ రవడ్జీ అనే మహిళను అఖిల్ అక్కినేని సైలెంట్‌గా నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ విషయాన్ని నాగార్జున తన ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. అఖిల్ చాలాకాలం నుంచి నటి జైనాబ్ రవడ్జీ ప్రేమలో ఉన్నారు. వీరిద్దరూ తమ రిలేషన్‌ను పెళ్లిగా మార్చుకోవాలని భావిస్తున్నారు. ఈక్రమం లోనే తమ ప్రేమ గురించి ఇరు కుటుంబాల్లో చెప్పడం వారు ఓకే



చెప్పడం అన్నీ కూడా చక చక జరిగిపోయాయి. అటు నాగార్జున సైతం అఖిల్ పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మార్చి 24 న అక్కినేని వారసుడు అఖిల్ జైనాబ్ వివాహం ఘనంగా జరగబోతున్నట్లు తెలుస్తోంది. ఈ పెళ్లికి సంబంధించిన పూర్తి పనులను ఇరు కుటుంబ సభ్యులు చూసుకోబోతున్నారు. అయితే ఈ వేడుకకు బిజినెస్ పర్సన్స్‌తో పాటు సినీ సెలబ్రిటీలు, క్రికెటర్స్ హాజరు కాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న అక్కినేని అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. అఖిల్ మొదట శ్రీయ భూపాల్ అనే అమ్మాయిని ప్రేమించాడు. వీరిద్దరికి నిశ్చితార్థం కూడా జరిగింది. ఏం జరిగిందో తెలియదు కానీ అఖిల్‌తో శ్రీయ భూపాల్ పెళ్లి క్యాన్సిల్ చేసుకుంది. కొన్నాళ్లు సింగిల్‌గా ఉన్న అఖిల్, తర్వాత జైనాబ్ రవడ్జీతో ప్రేమలో పడ్డారు. ప్రస్తుతం వీరిద్దరు నిశ్చితార్థం చేసుకున్నారు. ఇక అఖిల్ కెరీర్ విషయానికి వస్తే అఖిల్ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. ఆ తరువాత అఖిల్ నటించిన సినిమాలన్నీ కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. బ్యాచ్‌లర్ సినిమానే యావరేజ్‌గా నిలిచింది. ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన ఏజెంట్ సినిమా అట్టర్ ఫ్లాప్ గా నిలిచింది. దీంతో ఈసారైనా హిట్ కొట్టాలని ప్లాన్ చేసుకుంటున్నాడు. దీంతో సినిమాల నుంచి అఖిల్ కొంత గ్యాప్ తీసుకున్నాడు.

# హాలీవుడ్ లోకి ఎన్టీఆర్

సినిమా : తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్రనటుల్లో ఒకరైన జూనియర్ ఎన్టీఆర్ త్వరలో హాలీవుడ్ లోకి ప్రవేశించ బోతున్నారు. ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు జేమ్స్‌గన్ ఈ మేరకు ప్రకటించటం దీనికి ఊతమిస్తోంది. ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా ఎన్టీఆర్‌కు గుర్తింపు వచ్చింది. గతంలో రాజమౌళి తీసిన సింహాద్రి, యమదొంగ సినిమాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. ప్రస్తుతం ఆయన వార్ 2 సినిమా ద్వారా బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హృతిక్ కలిసిలో ఆయన నటిస్తున్నారు. మరోవైపు ప్రశాంత్ నీల్ తో కలిసి యాక్షన్ అడ్వెంచర్‌కు కూడా సిద్ధమయ్యారు. హాలీవుడ్ చిత్ర నిర్మాత, దర్శకుడు జేమ్స్ గన్



సూపర్‌మ్యాన్, సూసైడ్ స్క్వాడ్, గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ వంటి గొప్ప అంతర్జాతీయ చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆర్ఆర్ ఆర్ సినిమాలో ఎన్టీఆర్ యాక్షన్ చాలా బాగుందంటూ పొగడ్తలతో ముంచెత్తారు. ముఖ్యంగా 'బోనుల్లో నుంచి పులులతో పాటు బయటకు దూకిన ఆ నటుడు (ఎన్టీఆర్)తో నేను పనిచేయాలనుకుంటున్నాను. అతను అద్భుత నటుడు. నేను అతనితో ఏదో ఒక రోజు పనిచేయా లనుకుంటున్నాను' అని అన్నారు. ఇప్పటిదాకా టాప్ హాలీవుడ్ ఫిల్మ్‌మేకర్ ఓ తెలుగు హీరోను వుద్దేశించి మాట్లాడటం ఇదే మొదటిసారి అన్నట్లుగా ఇండిస్ట్రీలో చర్చ జరుగుతోంది.

## శంకర్ సినిమాల్లో కంటెంట్ లోపించిందా!

శంకర్.. ఒకప్పుడు ఈ పేరు చూసి కోట్లమంది కళ్లు మూసుకుని థియేటర్లకు వెళ్లిపోయేవారు. హీరోలు కథ వినకుండానే సినిమా ఒప్పేసుకునేవారు. నిర్మాతలు లెక్కలు వేసుకోకుండా ఎంతైనా ఖర్చు పెట్టేసేవాళ్లు. కానీ గత దశాబ్ద కాలంలో అంతా మారిపోయింది. శంకర్ సినిమాల్లో ఒకప్పటి భారీతనం మాత్రమే మిగిలింది. కంటెంట్ మాత్రం ఎక్కడికో పోయింది. ఒకప్పుడు శంకర్ ఎంత ఖర్చు పెట్టినా అది వర్త్ అనిపించేది. ఖర్చుకు తగ్గ అనుభూతి తెరపై కనిపించేది. కానీ ఇప్పుడు అంతా వృథా అనిపిస్తోంది. గేమ్ చేంజర్ సినిమాలో కేవలం పాటల కోసం 75 కోట్లు ఖర్చు పెట్టినట్లు ఘనంగా చెప్పుకుంది చిత్ర బృందం. తీరా సినిమా చూస్తే ఆ ఖర్చంతా వేస్ట్ అనిపించింది. పాటల కోసం పెట్టిన డబ్బుతో ఒక మంచి సినిమా తీసి ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గేమ్ చేంజర్ అనే కాదు.. ఇండియన్-2, ఐ లాంటి సినిమాల్లో భారీతనం పేరుతో అనవసర హడావుడి తప్ప సరైన కంటెంట్ కనిపించలేదు. ఐతే ఒకప్పటి విజయాల వల్ల, శంకర్‌కు ఉన్న స్టేచర్ వల్ల నిర్మాతలు ఆయన చెప్పిందల్లా చేస్తూ వచ్చారు. కానీ ఇకపై ఆ పరిస్థితి ఉండకపోవచ్చు. లైకా ప్రొడక్షన్స్ అధినేతలతో పాటు అన్నీ ఒక లెక్క ప్రకారం చేసే దిల్ రాజు సైతం అయిన కాడికి బడ్జెట్లు పెట్టి గట్టి ఎదురు దెబ్బలు తిన్నారు. ఇకపై శంకర్‌ను నమ్మి ఇలా మితిమీరిన బడ్జెట్లు పెట్టే నిర్మాతలు దొరక్కపోవచ్చు. ఇండియన్-2, గేమ్ చేంజర్ సినిమాలు శంకర్ పేరును బాగా దెబ్బ తీశాయి. ఇక ఆయన బడ్జెట్ల మీద మోజును తగ్గించి కంటెంట్ మీద దృష్టిపెట్టాల్సిన సమయం వచ్చింది.



# వరల్డ్ కప్ లో నైజీరియా సంచలనం



కౌలాలంపూర్: ఐసిసి అండర్-19 మహిళల ప్రపంచ కప్ లో పసికూన నైజీరియా జట్టు సంచలనం సృష్టించింది. సోమవారం జరిగిన గ్రూప్-సి లీగ్ మ్యాచ్‌లో నైజీరియా జట్టు రెండు పరుగుల తేడాతో న్యూజిలాండ్ పై అద్భుత విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్ కు దిగిన నైజీరియా జట్టు 13 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. అనంతరం న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టానికి 63 పరుగులకే పరిమితం చేసింది. 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 5 వికెట్ల నష్టానికి 57 పరుగులు చేసి గెలుపుకు చేరువైన కివీస్‌ను నైజీరియా బౌలర్ చివరి ఓవర్లో కట్టడి చేసింది. నైజీరియా బ్యాటర్లలో ఉదేహ్(19), కెప్టెన్ లక్కీ(18) రెండంకె ల స్కోర్ చేయగా, న్యూజిలాండ్ జట్టులో అనికా టోడ్(19) బ్యాటింగ్‌లో రాణించింది. గ్రూప్-డి లో ఆస్ట్రేలియా మహిళల జట్టు 2 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ పై, గ్రూప్-బి లో ఇంగ్లండ్ జట్టు 6 వికెట్ల తేడాతో పాకిస్తాన్ మహిళల జట్టు పై విజయం సాధించాయి. ఇక దక్షిణాఫ్రికా మహిళల జట్టు ఏకంగా 10 వికెట్ల తేడాతో సమోవా మహిళల పై విజయం సాధించాయి. సమోవా జట్టు 9.1 ఓవర్లలో 16 పరుగులకే ఆలౌట్ కాగా దక్షిణాఫ్రికా జట్టు 1.4 ఓవర్ల లోనే లక్ష్యాన్ని చేదించింది.

# సిరాజ్ కు నో ఛాన్స్

క్రికెట్ : ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తో పాటు ఇంగ్లండ్ తో మూడు వన్డేల సిరీస్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్‌కు అవకాశం దక్కలేదు. ఇటీవల ముగిసిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో సిరాజ్ దారుణంగా విఫలమయ్యాడు. దాంతో టీ మిండియా మేనేజ్‌మెంట్ అతని పై వేటు వేసింది. గత మూడు, నాలుగేళ్లుగా టీమిండియాలో రెగ్యులర్ ఆటగాడిగా కొనసాగిన సిరాజ్‌ను ఆకస్మాత్తుగా భారత జట్టు నుంచి తప్పించడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో విఫలమైనా.. వన్డే క్రికెట్‌లో సిరాజ్ గణంకాలు మెరుగ్గానే ఉన్నాయి. 2022 నుంచి సిరాజ్ ఇప్పటి వరకు వన్డేల్లో 72 వికెట్లు పడగొట్టాడు. ఈ





సమయంలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా కూడా సిరాజ్ నిలిచాడు. అంతే కాకుండా 2023 లో సిరాజ్ వన్డే ఫార్మాట్‌లో 47 వికెట్లు తీసాడు. వన్డే ప్రపంచకప్ 2023 లోనూ 11 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా 32 వికెట్ల తర్వాత సిరాజ్ 20 వికెట్లు తీశాడు. కానీ బుమ్రాకు అండగా మరో ఎండ్‌లో బౌలింగ్ చేయకపోవడంతో అతని ప్రదర్శన పేలవంగా కనిపించింది. ఈ క్రమంలోనే అతన్ని భారత జట్టులో నుంచి తప్పించి యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను తీసుకున్నారు. అయితే సిరాజ్‌ను తప్పించడానికి కెప్టెన్ రోహిత్ శర్మ మరో కారణం చెప్పాడు. కొత్త బంతితో సిరాజ్ ప్రభావం చూపినట్లు మిడిల్, డెత్ ఓవర్లలో రాణించలేదని, అందుకే అర్ష్‌దీప్ సింగ్‌ను తీసుకున్నట్లు వివరించాడు. అంతేకాకుండా బుమ్రా ఫిట్‌నెస్ పై సందేహాలు ఉండటం తోనే అతనికి బ్యాకప్‌గా అర్ష్‌దీప్‌ను తీసుకోవాల్సి వచ్చిందన్నాడు. అయితే భారత జట్టులో చోటు కోల్పోవడం పై సిరాజ్ తీవ్ర బాధలో ఉన్నాడు. ఈ క్రమంలోనే అతను రంజీ ట్రోఫీలో రీఎంట్రీ ఇవ్వాలని భావిస్తున్నారు. జనవరి 23 నుంచి హిమాచల్ ప్రదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో హైదరాబాద్ తరపున బరిలోకి దిగాలనుకుంటున్నాడు. ఇప్పటికే ఈ విషయాన్ని హెచ్‌సీఏకు తెలియజేశాడు. అయితే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ అనంతరం సిరాజ్‌కు తగిన విశ్రాంతి కావాలసి బీసీసీఐ మెడికల్ టీమ్ సూచించింది. అయినా విశ్రాంతి సమయాన్ని పక్కనపెట్టి బంతితో సత్తా చాటాలని సిరాజ్ భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com